ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5



అనంతపురం

జిల్లా వార్తలు

మంగళవారం 30 జూలై 2024



- కోర్సులలో సాంకేతికత.. ఆధునికత
- ప్రవేశాలకు పెరుగుతున్న డిమాండ్
- డిగ్రీ పూర్తయితే పరిపక్వత.. పరిజ్ఞానం
- కనీస అర్హతగా భావిస్తున్న ప్రైవేటు సంస్థలు
- ప్రభుత్వ ఉద్యోగాలు.. స్వయం ఉపాధికీ ఇదే..
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌తో ప్రభుత్వం చేయూత

ఉద్యోగానికి డిగ్రీ..!

డిగ్రీ చదివితేగానీ సమాజంలో కనీస చదువరిగా గుర్తింపు ఉండటం లేదు. అంతేకాదు.. బతుకు తెరువుకోసం ఉద్యోగం, ఉపాధి లభించాలన్నా కనీస అర్హత డిగ్రీ ఉండాల్సి వస్తోంది. నైపుణ్య రంగాల్లో రోజువారి కూలీలుగా చేరాలన్నా.. డిగ్రీ అడుగుతున్నారు. ఆ మాత్రం చదువు ఉంటేగానీ ఉద్యోగ, ఉపాధి పనులపై విషయ పరిజ్ఞానం ఉండదని భావిస్తున్నారు. అందుకే చాలామంది డిగ్రీ చదివేందుకు ఆసక్తి చూపుతున్నారు. డిగ్రీ ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని 2024-25 విద్యా సంవత్సరానికి రాష్ట్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలోని కళాశాలలకు 33,311 సీట్లను కేటాయించింది. ఇందులో కన్వీనర్ కోటాలో 23,404 సీట్లు, ఈడబ్ల్యూఎస్ 3,078, మేనేజ్‌మెంట్ కోటాలో 6,827 సీట్లు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 13 ప్రభుత్వ, రెండు ప్రైవేట్ ఎయిడెడ్, 60 ప్రైవేట్, ఒక ప్రైవేట్ వర్సిటీ కాలేజీ.. కలిపి మొత్తం 76 కళాశాలు ఉన్నాయి. వీటి పరిధిలో 33,311 మంది విద్యార్థులు డిగ్రీని అభ్యసించవచ్చు. ప్రవేశాలను కల్పించేందుకు నెల రెండో తేదీ నుంచి ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం ప్రారంభించింది.

అనంతపురం సెంట్రల్

49 కోర్సులు..

డిగ్రీలో మూడు సబ్జెక్టుల విధానాన్ని రద్దు చేశారు. నేషనల్ ఎడ్యుకేషన్ పాలసీ (ఎన్ఈపీ) మేరకు సింగిల్, మేజర్ పద్ధతిని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డిగ్రీ ఆనర్స్ కోర్సు వ్యవధిని నాలుగు సంవత్సరాలకు పెంచారు.

- బీఏలో ఆర్కియాలజీ, ఎకనామిక్స్, హిస్టరీ, పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, రూరల్ డెవలప్‌మెంట్, రూరల్ ఎకనామిక్స్, స్పెషల్ ఇంగ్లీష్, స్పెషల్ హిందీ, స్పెషల్ తెలుగు, స్పెషల్ ఉర్దూ కోర్సులు ఉన్నాయి.
- బీకామ్‌లో అకౌంటింగ్, బ్యాంకింగ్ ఫైనాన్సియల్ అండ్ ఇన్సూరెన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డిజిటల్ మార్కెటింగ్, జనరల్, ట్యాక్స్ ప్రొసీజర్ అండ్ ప్రాక్టీస్ కోర్సులు ఉన్నాయి.
- బీఎస్సీలో అనిమల్ బయోటెక్నాలజీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోకెమిస్ట్రీ, బయోటెక్నాలజీ, బాటనీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్, ఎల్ర్టానిక్స్, ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, జియాలజీ, హోమ్ సైన్స్, ఇండస్ట్రియల్ కెమిస్ట్రీ, మెటీరీయల్ సైన్స్, మ్యాథమేటిక్స్, మైక్రోబయాలజీ, న్యూట్రిషన్, ఆర్గానిక్ కెమిస్ట్రీ, ఆర్గానిక్ ఫార్మింగ్, ఫిజిక్స్, సెరికల్చర్, స్టాటిస్టిక్స్, జువాలజీ కోర్సులు ఉన్నాయి.
- బీబీఏలో బిజినెస్ అనాలసిస్, డిజిటల్ మార్కెటింగ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, రీటైల్ ఆపరేషన్స్‌తోపాటు జనరల్, ఆనర్స్, బీసీఏలో జనరల్, ఆనర్స్ కలిపి మొత్తం 49 కోర్సులకు రాష్ట్ర ఉన్నత విద్యా శాఖ అనుమతులు ఇచ్చింది.

ప్రభుత్వ చేయూత

కన్వీనర్ కోటాలో అడ్మిషన్ పొందే పేద విద్యార్థులకు(ఈడబ్ల్యూస్) రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తుంది. ఈ కోటాలో 2021-25 విద్యా సంవత్సరానికి జిల్లాలోని 60 ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో 17,361 సీట్లు ఉన్నాయి. పూర్తి స్థాయి సీట్లు భర్తీ అయితే రూ.25.37 కోట్లను ఫీజు రీయింబర్స్‌మెంట్ రూపంలో ప్రభుత్వం భరిస్తుంది. జిల్లాలో అత్యధికంగా 15 కళాశాలలకు ఎక్కువ సీట్లు కేటాయించారు. ఒక్కో కాలేజీకి 360 నుంచి 874 వరకు కన్వీనర్, ఈడబ్ల్యూఎస్ కోటాల్లో సీట్లను కేటాయించారు. వీటిలో బాలయేసు, పీవీకేకే, ఎస్వీ, ఎస్‌డీజీఎస్, సప్తగిరి, ఎస్ఎల్ఎన్, జేసీఎన్ఆర్ఎం, సరస్వతి, శ్రీవాణి, స్వామి వివేకానంద, ఎంఎస్, శ్రీబాలాజి విద్యావిహార్, ఎస్‌లైట్, ఎస్వీఎం, శ్రీసాయి మాస్టర్‌మైండ్ కళాశాలల పరిధిలోనే 8,007 సీట్లు ఉన్నాయి. ఇవన్నీ భర్తీ రూ.12.39 కోట్లను సంబంధిత కళాశాలలకు రాష్ట్ర ప్రభుత్వం వెచ్చిస్తుందని అధికార వర్గాలు తెలిపాయి.



ఉద్యోగ, ఉపాధి కల్పనే లక్ష్యం

డిగ్రీ పూర్తిచేసి, పట్టాలు పుచ్చుకుని వెళ్లిపోయి.. సరిపెట్టేకాలం పోయింది. కొత్త విధానంలో సబ్జెక్టులపై పట్టుసాధిస్తే.. విద్యార్థులకు మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. డిగ్రీలో ఒక సబ్జెక్టును ప్రధానంగా ఎంచుకుని, మరో సబ్జెక్టును అనుబంధంగా చదివేలా ప్రణాళికను ప్రవేశపెట్టింది. బీఎస్సీలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సబ్జెక్టును ప్రధానంగా తీసుకుని ఫారెస్ట్రీని అనుబంధంగా అభ్యసించవచ్చు. ఈ క్రమంలో టెక్నాలజీ, అడవులు రెండిటిపైనా విద్యార్థులు పట్టుసాధిస్తారు. వీటిలో ఏ అవకాశం వచ్చినా విద్యార్థి సద్వినియోగం చేసుకునే వెసులుబాటు ఉంటుంది.

మెండుగా ఉపాధి...



టెక్నికల్ అనుబంధమైన డిగ్రీ కోర్సులు పూర్తిచేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు మెండుగా లభిస్తాయి. ఎలక్ట్రికల్ కోర్సు చేసిన అనేకమంది వివిధ సంస్థలలో ఉద్యోగాలు చేస్తున్నారు. కొందరు సొంతంగా షాపులు నిర్వహిస్తున్నారు. మరింత మెరుగైన అవకాశాల కోసం పీజీ, పీహెచ్‌డీ చేయడానికి వెళ్తున్నారు.

-భక్తవత్సల, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి, ఆర్ట్స్ కళాశాల

విస్తరిస్తున్న మార్కెట్..



మార్కెట్ రంగం నానాటికీ విస్తరిస్తోంది. బీకామ్‌లో అకౌటింగ్, బ్యాకింగ్ ఫైనాన్షియల్ అండ్ ఇన్సూరెన్స్, కంప్యూటర్ అప్లికేషన్స్, డిజిటల్ మార్కెటింగ్, ట్యాక్స్ ప్రొసీజర్ అండ్ ప్రాక్టీస్ సబ్జెక్టులు చదివితే మార్కెటింగ్ రంగంలో అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. ఈ సబ్జెక్టులు లేనిదే వాణిజ్య, వ్యాపారాలు సాగడంలేదు.

-శ్రీరాములు నాయక్, కామర్స్ విభాగాధిపతి, ఆర్ట్స్ కళాశాల

గణితానికి అవకాశాలు ఎక్కువ..



కంప్యూటర్ కోర్సులు, ఇంజనీరింగ్, పోటీ పరీక్షలు.. ఇలా దేనికైనా గణితశాస్త్రం మూలస్తంభం. డిగ్రీలో గణితశాస్త్రం పూర్తిచేసిన వారికి లెక్కలపై పట్టు ఉంటుంది. దీంతో అనేక అవకాశాలను సొంతం చేసుకుంటున్నారు. జేఈఈ, ఈఏపీ సెట్, సివిల్స్ వంటి పోటీ పరీక్షల్లో గణితానికి అత్యధిక మార్కులు ఉంటాయి. ఈ సెబ్జెక్టును బోధించేవారికి డిమాండ్ ఎక్కువ.

- డాక్టర్ మురళి, గణితశాస్త్రం అధ్యాపకుడు, ఆర్ట్స్ కళాశాల

కనీసం డిగ్రీ ఉండాలి..



ఏదేని ఉద్యోగం ఇవ్వాలంటే కనీస అర్హత డిగ్రీ ఉండాలని నోటిఫికేషన్స్ ఇస్తున్నారు. డిగ్రీ ఉంటే విధులు నిర్వహించే పరిజ్ఞానం, పరిపక్వత ఉంటాయని ఉద్యోగ, ఉపాధిని కల్పించే సంస్థలు బావిస్తున్నాయి. అందుకే డిగ్రీ ప్రవేశాల శాతం గణనీయంగా పెరగుతోంది. డిమాండ్‌కు తగ్గట్టుగా కోర్సులను ప్రవేశపెట్టి సీట్లను పెంచుతున్నాము.

- డాక్టర్ దివాకరరెడ్డి, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్

పెరిగిన డిమాండ్...



డిగ్రీ ప్రవేశాలు పొందేందుకు డిమాండ్ పెరిగింది. అందులో బాలికలు పోటీపడి చేరుతున్నారు. డిగ్రీ పూర్తిచేస్తే ప్రభుత్వ నోటిఫికేషన్‌లకు దరఖాస్తు చేసుకోవచ్చు. సొంతంగా ఉపాధి అవకాశాలు పొందవచ్చు. అవసరాలకు అనుగుణంగా బీఏ, బీకామ్, బీఎస్సీ బీబీఏ కోర్సులలో రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ అనేక మార్పులు చేసి ప్రవేశపెడుతోంది.

- డాక్టర్ శంకరయ్య, కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల



జగదీశ్వరరెడ్డిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

హాస్టల్‌కు వెళ్లడం ఇష్టంలేక..!

ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థలు తమ హాస్టల్ విద్యార్థులకు ఇటీవల హోంసిక్ హాలిడేస్ ఇచ్చాయి. అవి ఆదివారంతో పూర్తయ్యాయి. సోమవారం నుంచి మళ్లీ హాస్టల్‌కు వెళ్లాల్సి రావడంతో ఇద్దరు విద్యార్థులు ఇంటి నుంచి పారిపోయారు. పోలీసులు సకాలంలో వెతికి పట్టుకుని.. తల్లిదండ్రులకు అప్పగించారు. నార్పల మండలం దిగుమర్రికి చెందిన జగదీశ్వరరెడ్డి ఆరో తరగతి చదువుతున్నాడు. నార్పలకు చెందిన సాయికీర్తి తొమ్మిదో తరగతి చదువుతోంది. వీరిద్దరూ అనంతపురం నగరంలోని వేర్వేరు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు. తమ బిడ్డలు కనిపించడం లేదని తల్లిదండ్రులు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్రమత్తమైన ఎస్ఐ రాజశేఖర్ రెడ్డి.. నార్పల బస్టాండ్, పరిసర ప్రాంతాలలో గాలింపు చర్యలు చేపట్టారు. నార్పల బస్టాండ్ సర్కిల్‌లో ఉన్న ఇద్దరినీ గంట వ్యవధిలో పట్టుకుని తల్లిదండ్రులకు అప్పగించారు. ఇంటి నుంచి వెళ్లిపోవడానికి ఇద్దరూ ఒకే కారణం చెప్పడం గమనార్హం. తమకు హాస్టల్‌కు వెళ్లడం ఇష్టం లేదని చిన్నారులు చెప్పడంతో తల్లిదండ్రులకు ఎస్ఐ కౌన్సెలింగ్ ఇచ్చారు. చదువుల విషయంలో విద్యార్థులపై ఒత్తిడి తీసుకురావద్దని వారికి సూచించారు.

- నార్పల



సాయికీర్తిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి

తహసీల్దార్లు వచ్చేశారు..!

అనంతపురం టౌన్, జూలై 29: ఎన్నికల సమయంలో ఇతర జిల్లాలకు వెళ్లిన తహసీల్దార్లు సోమవారం అనంతకు చేరుకుంటున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు వీరిని కడప, కర్నూలు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలకు అప్పట్లో బదిలీ చేసిన విషయం తెలిసిందే. ఇలా వెళ్లిన మొత్తం 39 మంది తిరిగి జిల్లాకు వచ్చారు. కలెక్టరేట్‌లో సోమవారం మధ్యాహ్నం నుంచి రిపోర్ట్ చేసుకున్నారు. రాత్రి 7 గంటల సమయానికి 20 మంది వరకు రిపోర్ట్ చేసుకున్నట్లు కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.



కరిగిపోయిన గుట్ట

హై టెన్షన్..!



యాడికి-చందన రోడ్డు.. సర్వే నంబరు 753-1లో చిన్నపేట ఆంజనేయస్వామికి 1.21 ఎకరాలు మాన్యం భూమి ఉంది. ఇందులో హైటెన్షన్ విద్యుత్ ట్రాన్స్‌మిషన్ టవర్లు ఉన్నాయి. మట్టి మాఫియా దెబ్బకు టవర్లు కూలిపోయేటంతటి ప్రమాదకర పరిస్థితిలో ఉన్నాయి. చుట్టూ మట్టిని తవ్వేసి.. టవర్ ప్రాంతంలో మాత్రమే వదిలేయడంతో.. చిన్నపాటి మట్టి దిమ్మెమీద టవర్ ఏర్పాటు చేసినట్లు కనిపిస్తోంది. ఎన్నికల సమయంలో వైసీపీ మండల నాయకుడు ఒకరు ఇక్కడ భారీగా మట్టిని తవ్వుకున్నారు. ట్రాన్స్‌మిషన్ టవర్లను పరిశీలించేందుకు ఇటీవల వచ్చిన పవర్‌గ్రిడ్ అధికారులు.. ఇక్కడ మట్టి తవ్వకాలను చూసి విస్తుపోయారు. మూడు నెలల క్రితం తనిఖీలకు వచ్చినపుడు అంతా బాగుందని, ఈ లోగానే ఇంత పెద్ద ఎత్తున మట్టిని ఎలా తవ్వుకుపోయారని చర్చించుకున్నట్లు సమాచారం. దీనిపై రెవెన్యూ అధికారులను సంప్రదించి నివేదిక తీసుకున్నారు. టవర్ ఉన్న భూమి చిన్నపేట ఆంజనేయస్వామి మాన్యం అని వారు నివేదిక ఇచ్చినట్లు తెలిసింది. మట్టి అక్రమ తవ్వకాలపై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు పవర్ గ్రిడ్ అధికారులు నివేదిక పంపినట్లు సమాచారం.

- యాడికి



ఎంత మట్టిని తవ్వారో.. చూడండి..

మట్టి తవ్వకాలతో ప్రమాదకరంగా టవర్

కాస్తంత వర్షం

అనంతపురం అర్బన్, జూలై 29: జిల్లాలోని పలు ప్రాంతాల్లో సోమవారం వర్షం కురిసింది. అనంతపురం, గార్లదిన్నె, డి.హీరేహాళ్, బొమ్మనహాళ్ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. పుట్లూరు, కూడేరు, బెళుగుప్ప, నార్పల ప్రాంతాల్లో చిరుజల్లులు పడ్డాయి.



అనంతపురంలో కురుస్తున్న వర్షం

ఐ చీర్ ఫర్ భారత్

పారిస్ ఒలింపిక్స్‌లో పాల్గొంటున్న భారత క్రీడాకారులకు అభినందనలు తెలపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ కోరారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టరేట్లో ఒలింపిక్స్ సెల్ఫీ పాయింట్‌ను సోమవారం ప్రారంభించారు. భారత క్రీడాకారులు పతకాలు సాధించి దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకు రావాలని ఆకాంక్షిస్తూ.. 'ఐ చీర్ ఫర్ భారత్' నినాదంతో సెల్ఫీ పాయింట్ ఏర్పాటు చేశారు. క్రీడాకారులు, క్రీడాభిమానులు, కోచ్‌లు, పీడీలు, పీఈటీలు సెల్ఫీ పాయింట్‌ను సందర్శించాలని కలెక్టర్ కోరారు. కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎస్‌కే షఫీ పాల్గొన్నారు.

- అనంతపురం క్లాక్‌టవర్



ఒలింపిక్ సెల్ఫీ పాయింట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్

తాగునీటి సమస్యకు

శాశ్వత పరిష్కారం

- నిర్వహణ బకాయిలు రూ.150 కోట్లు
- ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్



అధికారులతో చర్చిస్తున్న మంత్రి

ఉరవకొండ, జూలై 29: ఉరవకొండలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. నియోజకవర్గంలోని నింబగల్లు, కొనకొండ్ల సమీపంలోని సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను సోమవారం ఆయన పరిశీలించారు. నీటి పంపింగ్ గురించి ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ఎహషాన్ బాషా, డీఈ అంజుమన్ నస్రీన్, జేఈ షమీద పర్వీన్‌తో చర్చించారు. సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ఫిల్టర్ బెడ్లు అధ్వానంగా ఉన్నాయని, వారంలోపు తాత్కాలిక మరమ్మతులు చేపట్టి నీటి సరఫరాకు చర్యలు తీసుకోవాలని సూచించారు. నిర్వహణ కోసం ఎంత డబ్బులు వచ్చాయో వివరాలు అందించాలని సూచించారు. ఉరవకొండ స్కీం నిధులలో రూ.5 కోట్లను వేరే ప్రాజెక్టులకు మళ్లించారని, వాటి రికవరీ మార్గాలను అన్వేషించాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. ఆ నిధులను తిరిగి తీసుకునేందుకు సాఫ్ట్‌వేర్‌లో మార్గం లేదని అధికారులు తెలిపారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ, పట్టణంలో తాగు నీటి సమస్య ఎంత తీవ్రంగా ఉందో ఎన్నికల సమయంలో చూశామని, ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తాత్కలిక ఉపశమనం కోసం ట్రాక్టర్లను ఏర్పాటు చేశామని తెలిపారు. గత ఐదేళ్ల తాగు నీటి ప్రాజెక్టులు పూర్తి నిర్లక్ష్యానికి గురయ్యాయని అన్నారు. తాగునీటి ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించి రూ.150 కోట్ల బకాయిలు ఉన్నాయని తెలిపారు. ర్యాపిడ్ సౌండ్ ఫిల్టర్స్ పెట్టాలంటే రూ.7 కోట్లు ఖర్చుచేయాల్సి వస్తుందని, తాత్కాలికంగా మైక్రోఫిల్టర్స్ టెక్నాలజీని పరిశీలిస్తున్నామని తెలిపారు. ట్యాంకుల్లోకి నీటిని అదనంగా ఎక్కడ నుంచి తీసుకురావాలి, ఏ రకంగా పంపిణీ చేయాలనే విషయాన్ని పరిశీలిస్తున్నామని తెలిపారు. గ్రామాలు, పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని, పరిష్కారానికి అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వజ్రకరూరు మండలం కొనకొండ్ల సమీపంలో ఉన్న సమ్మర్‌స్టోరేజీ ట్యాంక్‌ను పరిశీలించారు. ట్యాంక్ ద్వారా 14 గ్రామాలకు రోజూ తాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు తయారు చేయాలని సూచించారు. ట్యాంక్‌ను నింపేందుకు ఎన్ని రోజులు పడుతుందని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో ఆర్డీవో శ్రీనివాసులురెడ్డి, డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మెన్లు దేవినేని పురుషోత్తం, రేగాటి నాగరాజు, బీసీ మారెన్న, మండల కన్వీనర్లు విజయ్‌భాస్కర్, నూతేటి వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

ఒకటో తేదీ.. ఇంటివద్దకే పింఛన్: కలెక్టర్



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టరు, డీఆర్ఓ తదితరులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 29: ఆగస్టు ఒకటో తేదీన సచివాలయ సిబ్బంది లబ్ధిదారుల ఇంటి వద్దకే వచ్చి పింఛన్లను అందజేస్తారని కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. సమాజంలోని అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగానే పింఛన్ మొత్తాన్ని రూ.3 వేల నుంచి రూ.4 వేలు, రూ.6 వేలకు, రూ.5 వేల నుంచి రూ.10 వేలు, రూ.15 వేలకు పెంచిందని తెలిపారు. పెంచిన మొత్తాన్ని ఈ నెల ఒకటో తేదీన లబ్ధిదారులకు పంపిణీ చేశామని అన్నారు. అదే తరహాలో ఆగస్టు ఒకటో తేదీన జిల్లాలోని 2,87,656 మందికి రూ.126 కోట్లు పంపిణీ చేయడానికి సిద్ధం చేశామని తెలిపారు. ఒకటో తేదీ ఉదయం 6 గంటలకు గ్రామ-వార్డు సచివాలయ సిబ్బంది పింఛన్‌దారుల ఇంటివద్దకే వెళ్లి సొమ్ము అందజేస్తామని తెలిపారు. ఎవరూ సచివాలయాలకు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేదని అన్నారు. పింఛన్ పంపిణీ రెండు రోజులు మాత్రమే జరుగుతుందని, అందరికీ మొదటి రోజే ఇస్తామని, సాంకేతిక సమస్యలు తలెత్తితే రెండో రోజు ఇస్తామని తెలిపారు. పింఛన్‌దారులు ఒకటో తేదీన ఇళ్ల వద్దనే ఉండాలని కోరారు. మున్సిపాలిటీలలో కమిషనర్లు, మండలాలలో ఎంపీడీఓలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

అర్జీదారుల ఫిర్యాదులపై నిర్లక్ష్యం చేయవద్దని, అన్నింటినీ పరిష్కరించడానికి కృషిచేయాలని అధికారులను కలెక్టరు డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజల నుంచి 394 ఫిర్యాదులు అందాయి. వాటిని కలెక్టర్, డీఆర్ఓ, ఇతర అధికారులు స్వీకరించారు. అనంతరం అర్జీలపై అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. అర్జీల పరిష్కారానికి ఆయా శాఖల ఉన్నతాధికారులు చొరవ తీసుకోవాలని సూచించారు. పక్కాగా పరిశీలించి సమస్యకు పరిష్కారం చూపిస్తే బాధితులు మళ్లీమళ్లీ గ్రీవెన్స్‌కు రారని అన్నారు. అందుకే వచ్చిన ఫిర్యాదులను ఒక పద్ధతిలో పరిష్కరించాలని సూచించారు. ఏ స్థాయిలో పరిష్కరించే అర్జీలు ఆ స్థాయిలోనే పరిష్కరిస్తే జిల్లా స్థాయికి బాధితులు రారని తెలుసుకోవాలని సూచించారు. బాగా పనిచేసి, అర్జీలు తక్కువుగా వచ్చేలా ప్రతిశాఖ చూడాలని అన్నారు. రోజువారీ నివేదికలను తప్పకుండా పంపించాలని ఆదేశించారు.

అర్ధరాత్రి దొంగలు పడ్డారు

- నిఘా వేసి వెంబడించిన అన్నదమ్ములు
- రెండు బైక్‌లు, స్కార్పియో స్వాధీనం
- పోలీసుల అదుపులో అంతర్రాష్ట్ర ముఠా

నంబులపూలకుంట, జూలై 29: అంతర్రాష్ట్ర దొంగల ముఠా ఆదివారం అర్ధరాత్రి హల్‌చల్ చేసింది. నలుగురు దొంగలు రెండు బైకుల మీద నంబులపూలకుంట మండలానికి వచ్చారు. కదిరి-రాయచోటి ప్రధాన రహదారిలో కొట్టంవారిపల్లి వద్ద వాహనాలను ఆపి.. ఓ ఇంటి వైపు వెళ్లారు. ఆ ఇంటి యజమాని గమనించి కేకలు వేశారు. దీంతో దొంగలు పారిపోయేందుకు ప్రత్నించారు. ఒక వాహనం రాయచోటి వైపు, మరో వాహనం కదిరివైపు వెళ్లాయి. ఇంటి యజమాని కుమారులు మహేష్, గణేష్ కదిరివైపు వెళుతున్నవారిని బైకుమీద వెంబడించారు. అది గమనించిన దొంగలు, గాండ్లపెంట మండలం చామల గొంది రోడ్డు సమీపంలో వాహనాన్ని వదిలి పరుగులు తీశారు. వారు వదిలి వెళ్లిన బైకు వద్ద సోమవారం తెల్లవారుజాము వరకు మహేష్, గణేష్ మాటు వేశారు. తెల్లవారు జామున ఏపీ 03 బీఎఫ్ 1746 నంబరుగల స్కార్పియో వాహనం అక్కడికి వచ్చింది. అందులో ఉన్న వ్యక్తులు దొంగలు వదిలివెళ్లిన బైకును తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా.. మహేష్, గణేష్ వారిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. దీంతో దొంగలు స్కార్పియో ఎక్కి తప్పించుకుని వెళ్లిపోయారు. ఈ విషయాన్ని సోదరులిద్దరూ పోలీసులకు తెలియజేశారు. పోలీసులు స్పందించి అదే మండలంలోని తిమ్మమ్మమర్రిను హైస్కూల్ వద్ద ఉన్న జనసేన మండల అధ్యక్షుడు చౌదరికి సమాచారం అందించారు. వెంటనే ఆయన గ్రామస్థులతో కలిసి ఓ ఎక్స్‌కవేటర్‌ను, కొన్ని వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టించారు. స్కార్పియో రాగానే అందులో ఉన్న ముగ్గురు దొంగలను పట్టుకునేందుకు గ్రామస్థులు ప్రయత్నించారు. వారిలో ఇద్దరు పారిపోగా, డ్రైవర్‌ను దొరకబుచ్చుకున్నారు. డ్రైవర్‌ను, స్కార్పియోను పోలీసులకు అప్పగించారు. స్కార్పియోలో ఇంటర్‌నెట్ పరికరాలు, మూడుకొత్త మొబైల్ ఫోన్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. డ్రైవర్‌ను విచారించి.. తప్పించుకున్న ఇద్దరిని సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పట్టుకున్నారు. ఆ తరువాత మరో పల్సర్ వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

పాత నేరస్థులే..

పోలీసులకు పట్టుబడిన స్కార్పియో వాహనం అన్నమయ్య జిల్లా తూముకుంట దిగువమూలకు చెందిన యోగీశ్వర్‌నాయుడు పేరిట ఉంది. వాహనాన్ని తానే నడుపుతుంటారు. పోలీసులకు పట్టుబడింది ఇతనే. మిగిలిన నలుగురు బైక్‌ల మీద రాగా.. వారిని కవర్ చేస్తూ యోగీశ్వర్ నాయుడు తన స్కార్పియోలో వచ్చాడు. పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకు (ఏపీ 40 బీవీ6889) తూర్పు గోదావరి జిల్లా రాజానగరం వారి జయప్రకాష్ పేరిట ఉంది. సెల్‌ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా పోలీసులు పట్టుకున్న మరో ఇద్దరు కర్ణాటకవాసులని తెలిసింది. ఈ ముఠా సూత్రధారి చిత్తూరు జిల్లావాసి అని పోలీసులు గుర్తించారు. అతన్ని అదుపులోకి తీసుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. పట్టుబడినవారిపై ఎర్రచందనం కేసులు కూడా ఉన్నట్లు సమాచారం. సబ్ జైళ్లలో ఏర్పడిన పరిచయాలతో వీరు ముఠాగా ఏర్పడినట్లు తెలిసింది.

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలు

పోలీసుల అదుపులో ఉన్న దొంగల ముఠా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగిస్తున్నట్లు గుర్తించారు. ముఠా సభ్యుల వద్ద ఉన్న సెల్‌ఫోన్‌లలో సిమ్ కార్డులు లేవని, ఇంటర్‌నెట్‌తో అన్ని మొబైల్స్ అనుసంధానం చేసుకున్నారని సమాచారం. స్కార్పియోలో ఉన్న యోగీశ్వర్ నాయుడికి వీరి కదలికలు సెల్‌ఫోన్ సిగ్నల్స్ ద్వారానే తెలుస్తాయి. వాటి ఆధారంగా ఇబ్బందులు ఎదురైతే వెంటనే రంగంలోకి దిగి రక్షించేందుకు రంగంలోకి దిగేవాడు. ఇతని వద్ద ఉన్న పరికరాల ఆధారంగానే పారిపోయిన ఇద్దరిని పోలీసులు వెంటనే పట్టుకోగలిగారు.




స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలు



దొంగలను వెంబడించిన యువకులు మహేష్, గణేష్

నగదు.. ఆభరణాలు..

పట్టుబడిన స్కార్పియోలో రూ.10 వేలు నగదు, ఒక చేతి గడియారం, ఒక జత వెండి కాళ్ల పట్టీలు, మూడు జతల అద్దాలు, వైఫై మోడెం, సెల్‌ఫోన్‌లు తదితరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కడప జిల్లా దువ్వూరులో శనివారం రాత్రి ఓ బైక్‌ను చోరీ చేసి తెచ్చినట్లు సమాచారం. పోలీసులకు పట్టుబడ్డ పల్సర్ వాహనం కొనుగోలు చేసి దాదాపు 20 రోజులై ఉంటుంది. ఇంకా నంబర్ కూడా రాలేదు.



స్వాధీనం చేసుకున్న స్కార్పియో వాహనం

తుంగభద్రకు కొనసాగుతున్న వరద



టీబీ డ్యాం నుంచి దిగువకు వదిలిన వరదనీరు

బొమ్మనహాళ్, జూలై 29: తుంగభద్ర జలాశయానికి వరదనీరు పోటెత్తడంతో మొత్తం 33 క్రస్ట్ గేట్ల(26 గేట్లు రెండున్నర అడుగులు, మరో 7 గేట్లు ఒక్క అడుగు మేర)ను ఎత్తి దిగువకు నీరు వదిలారు. 1,47,518 క్యూసెక్కుల నీటిని తుంగభద్రనదికి, 9087 క్యూసెక్కులను కాలువలకు విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంకు ఇన్‌ఫ్లో 1,46,257 క్యూసెక్కులుండగా ఔట్‌ఫ్లో కాలువలకు వదిలే నీటితో కలిపి 1,56,840 క్యూసెక్కులు ఉంది. డ్యాం నిల్వ సామర్థ్యం 105.788 టీఎంసీలు కాగా 97.448 టీఎంసీల నీటిని నిల్వ ఉంచి మిగిలిన నీటిని నదికి వదిలేస్తున్నారు. హెచ్చెల్సీ ఆంధ్రా సరిహద్దు 105 వ కి.మీ. వద్ద 1170 క్యూసెక్కుల నీటి ప్రవాహం కొనసాగుతోంది.

పీఏబీఆర్‌కు 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

కూడేరు: తుంగభద్ర డ్యాం నుంచి పీఏబీఆర్ డ్యాంలోకి 550 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తున్నట్లు ఇరిగేషన్ ఏఈఈ లక్ష్మీదేవి తెలిపారు. వరద జలాలు వస్తున్న నేపథ్యంలో పీఏబీఆర్ డ్యాంలో సోమవారం నీటి మట్టం పెరిగింది. ప్రస్తుతం డ్యాంలో 417.00 మీటర్ల వరకు నీటి నిల్వ ఉంది.

కిలో టమోటా రూ.30

అనంతపురం రూరల్, జూలై 29: కక్కలపల్లి మార్కెట్‌లో సోమవారం కిలో టమోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయింది. సరాసరి ధర రూ.23, కనిష్ఠ ధర రూ.13 పలికాయి. మార్కెట్‌కు మొత్తంగా 1500 టన్నులు వచ్చాయని రాప్తాడు మార్కెట్‌యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు.

చీనీ టన్ను రూ.17వేలు

అనంతపురం రూరల్, జూలై 29: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా ధర రూ. 17200, కనిష్ఠంగా రూ. 2500, సరాసరి ధర రూ. 12వేలతో అమ్ముడు పోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 741 టన్నులు వచ్చాయన్నారు.

సీఎం దృష్టికి 'సీమ' కరువు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

అనంతపురం విద్య, జూలై 29: రాష్ట్రంలోని మిగతా ప్రాంతాల్లో వర్షాలు సమృద్ధిగా కురుస్తుంటే సీమ జిల్లాలో చినుకు జాడ లేకపోవడం బాధాకరమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే సీమ జిల్లాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తామన్నారు. సీపీఐ ఆఫీస్‌లో సోమవారం పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శి జాఫర్, శ్రీసత్యసాయి జిల్లా కార్యదర్శి వేమయ్య తో కలిసి ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. రామకృష్ణ మాట్లాడుతూ ఏపీలో అనేక మంది స్వాతంత్ర్య సమరయోధులు, నిస్వార్థ సేవకులు ఉన్నారన్నారు. టంగుటూరి ప్రకాశంపంతులు, పుచ్చలపల్లి సుందరయ్య, చండ్ర రాజేశ్వర్‌రావు వంటి మహనీయుల పేర్లను భవిష్యత్తులో ప్రభుత్వ పథకాలకు పెడతారని ఆశిస్తున్నట్లు తెలిపారు. పోలవరం నిర్వాసితులకు రూ.30వేల కోట్ల పరిహారం ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రతి ఏటా వర్షాలు వచ్చినప్పుడు వాళ్లు ఇళ్లు ఖాళీ చేసే పరిస్థితులు ఉన్నాయన్నారు. సీమ జిల్లాల్లో నాలుగు లక్షల ఎకరాల్లో పంటలు వేయాల్సి ఉండగా...ఇప్పటి వరకూ లక్ష ఎకరాల్లోనే పంట వేశారన్నారు. ప్రభుత్వం ఇప్పటి నుంచే ప్రత్యామ్నాయ మార్గాలపై ఆలోచన చేయాలని సూచించారు. హెచ్చెల్సీ, హంద్రీనీవా కాలువ ద్వారా అదనపు నీళ్లు తెప్పించడానికి కృషి చేయాలని కోరారు. ఈ కరువు పరిస్థితులు వివరించడానికి ఈ నెల 31న సీఎం చంద్రబాబును కలుస్తామని విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానంగా తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నారాయణ స్వామి, శ్రీరాములు, లింగమయ్య, కుళ్లాయిస్వామి పాల్గొన్నారు.

స్వీడన్‌లో బీటెక్ చదివే అవకాశం

- జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య



బీటీహెచ్ ప్రవేశాలు పొందిన విద్యార్థులతో రిజిస్ట్రార్ క్రిష్ణయ్య

అనంతపురం సెంట్రల్, జూలై 29: జేఎన్‌టీయూ, బ్లెకింగ్ వర్సిటీ సంయుక్త ఆధ్వర్యంలో అమలుచేస్తున్న ఇంటిగ్రేటెడ్ కోర్సుల ద్వారా స్వీడన్‌లో బీటెక్ చదివే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య తెలిపారు. ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు ఆధ్వర్యంలో సోమవారం 13మంది విద్యార్థులకు క్రిష్ణయ్య అడ్మిషన్ పత్రాలను అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఇంటిగ్రేటెడ్ కోర్సు ద్వారా బీటెక్ మూడు సంవత్సరాలు జేఎన్‌టీయూలో, చివరి సంవత్సరం స్వీడన్‌లోని బ్లెకింగ్ వర్సిటీలో పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు. బీటెక్ డిగ్రీ పట్టాను జేఎన్‌టీయూ, బీఎస్సీ పట్టాను బ్లెకింగ్ వర్సిటీ ప్రదానం చేస్తాయన్నారు. అనంతరం స్వీడన్‌లోనే ఎంఎస్ పూర్తిచేసి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు సొంతం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు సుజాత, కిరణ్మయి, ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎల్లలు దాటిన ఎస్కేయూ ఖ్యాతి: ఇన్‌చార్జి వీసీ



వేడుకల్లో పాల్గొన్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్‌లతో అధికారులు

అనంతపురం సెంట్రల్, జూలై 29: విద్యార్థులకు ఉన్నతమైన విద్యనందించి, ప్రతిభావంతులుగా తీర్చడంతో ఎస్కేయూ ఖ్యాతి ఎల్లలు దాటిందని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత పేర్కొన్నారు. సోమవారం ఎస్కేయూ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రొఫెసర్ అనిత, రెక్టార్ వెంకటనాయుడు, రిజిస్ట్రార్ డాక్టర్ రమేష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరై శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళులర్పించి వేడుకలను ప్రారంభించారు. 1967లో వెంకటేశ్వర పీజీ సెంటర్‌గా ప్రారంభించిన ఎస్కేయూ ప్రస్తుతం వేలాది విద్యార్థులకు పీజీ, పీహెచ్‌డీ పట్టాలను ప్రదానం చేస్తోందని తెలిపారు. వర్సిటీ విద్యర్థులు అనేకమంది దేశవిదేశాల్లో ఉన్నతస్థాయిల్లో ఉన్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు, బోధన, బోధనేతర సిబ్బంది, రీసర్చ్ స్కాలర్స్‌తోపాటు పీఆర్వో ప్రొఫెసర్ రామగోపాల్ పాల్గొన్నారు.

పనిమంతులను ప్రోత్సహిస్తా

- వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్
- ఎమ్మెల్యే దగ్గుపాటితో కలిసి సర్వజనాస్పత్రి తనిఖీ
- గైనిక్, బాలింతలు, రక్తనిధి, ఆర్థోవార్డుల పరిశీలన
- రోగులతో వైద్యసేవలపై ఆరా

అనంతపురం టౌన్, జూలై 29: మంచిగా పనిచేస్తే ప్రోత్సహిస్తా. తప్పుచేస్తే శిక్షిస్తానని వైద్య ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ డాక్టర్లు, వైద్య సిబ్బందిని హెచ్చరించారు. మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి ఆయన అనంత ప్రభుత్వసర్వజన ఆస్పత్రికి సోమవారం వచ్చారు. అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్‌తో కలిసి ఆస్పత్రిని తనిఖీ చేశారు. గైనిక్, బాలింతల వార్డులకు వెళ్లి అక్కడ గర్భిణులు, బాలింతలకు అందుతున్న సేవలు, వసతులను స్వయంగా పరిశీలించారు. రోజుకు ఎంతమంది డెలివరీకి వస్తున్నారు? ప్రస్తుతం ఎంతమంది ఆస్పత్రిలో ఉన్నారు? పడకలు ఎన్ని ఉన్నాయి? ఎలా సర్దుబాటు చేస్తున్నారు? తదితర వివరాలను సూపరింటెండెంట్, ఆర్ఎంఓలను అడిగి తెలుసుకున్నారు. అక్కడనుండి రక్తనిధి కేంద్రానికి వెళ్లి రక్త నిల్వలు పరిశీలించారు. ఆర్థోవార్డుకు వెళ్లి అక్కడ చికిత్సపొందుతున్న రోగులతో మాట్లాడారు. ఆస్పత్రిలో వసతుల పెంపునకు సహకరించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ మంత్రికి విన్నవించారు. అక్కడి నుంచి వైద్య కళాశాలకు వెళ్లి వైద్యాధికారులు, డాక్టర్లతో సమీక్ష నిర్వహించారు.

వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

శాఖాపరంగా కొన్ని సమస్యలు, లోటు పాట్లు ఉన్నాయి. వాటిని అడ్డుపెట్టుకొని రోగులకు వైద్యసేవలు అందించడంలో ఎక్కడా నిర్లక్ష్యం చేయవద్దని వైద్యాధికారులు, డాక్టర్లను మంత్రి సత్యకుమార్ హెచ్చరించారు. ప్రభుత్వ ఆస్పత్రిపై ప్రజలలో ఓరకమైన భావన ఉంటుందని, అలాంటపుడు మనం మరింత బాధ్యతగా పని చేసి నమ్మకాన్ని పెంచుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు సమయపాలన పాటించాలని, ఆస్పత్రికి వచ్చిన రోగులను ప్రేమగా చిరునవ్వుతో మాట్లాడించి చికిత్స అందించాలన్నారు.



వైద్యసేవల గురించి రోగులను అడిగి తెలుసుకుంటున్న మంత్రి



వైద్యాధికారులు, డాక్టర్ల సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

1200 పడకల స్థాయి పెంపునకు కృషి

అనంతసర్వజన ఆస్పత్రిని 1200 పడకల ఆస్పత్రిగా మార్చడానికి కృషి చేస్తానని మంత్రి సత్యకుమార్ పేర్కొన్నారు. సమీక్ష అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రస్తుతం అనంత ఆస్పత్రిలో 560 పడకల సామర్థ్యం మాత్రమే ఉందన్నారు. ఈఆస్పత్రికి రోజుకు 2వేలమందికి పైగా ఓపీకి, 1500వరకు అడ్మిషన్లు ఉంటున్నాయన్నారు. అయితే 560 పడకలకు సరిపడే డాక్టర్లు, సిబ్బంది, వసతులు మాత్రమే ఉన్నాయన్నారు. 2019 లోనే ఈఆస్పత్రికి ఎంసీహెచ్‌బ్లాక్, సర్జికల్ బ్లాక్ ఏర్పాటుకు రూ.300కోట్లు నిధులు ఇచ్చినట్లు వెల్లడించారు. కానీ ఇప్పటికీ ఎంసీహెచ్‌బ్లాక్ పనులు మొదలు కాలేదని, సర్జికల్‌బ్లాక్ పనులు నత్తనడకన సాగుతున్నాయన్నారు. వైసీపీ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేకపోవడం వల్లే ఈపరిస్థితి ఏర్పడిందన్నారు. సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో అన్నివిభాగాలు పనిచేయడానికి అవసరమైన చర్యలు తీసుకుంటామన్నారు. పెనుకొండలో వైద్య కళాశాల పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు.

టీడీపీ నాయకులపై వైసీపీ దాడి



గాయపడిన మాజీ సర్పంచ్ గోవిందు



పోలీస్‌స్టేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న టీడీపీ నాయకులు

ఉరవకొండ, జూలై 29: మండలంలోని లత్తవరం గ్రామంలో టీడీపీ నాయకులపై వైసీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. రెండేళ్లయినా గ్రామంలో పారిశుధ్య పనులను వైసీపీ నాయకులు పట్టించుకోకపోవడంతో, సోమవారం ఉదయం టీడీపీ నాయకులు అధికారులతో కలిసి డ్రైనేజీలను పరిశీలించారు. ఈనెల26న ఉపసర్పంచ్‌గా టీడీపీ మద్దతుదారుడు ఎన్నిక కావడంతో వైసీపీ నాయకులు జీర్ణించుకోలేకపోయారు. ఈక్రమంలోనే వైసీపీ నాయకులు టీడీపీ నాయకులను దూషించి, కవ్వింపు చర్యలకు పాల్పడ్డారు. ఉరవకొండ నుంచి లత్తవరానికి మాజీ సర్పంచ్ గోవిందుతో పాటు మరో ఐదుగురు టీడీపీ నాయకులు వెళ్లారు. పక్కా ప్రణాళికతో ఉన్న వైసీపీ నాయకులు కళ్లల్లోకి కారంపొడి చల్లి, రాళ్లతో టీడీపీ నాయకులపై దాడి చేశారు. మాజీ సర్పంచ్ గోవిందుతో పాటు, మోహన్, గోపాల్, నాగరాజు గాయపడ్డారు. గాయపడిన వారిని ఉరవకొండ ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మరోసారి సర్పంచ్ వంశీ అనుచరులు దాడి చేసేందుకు యత్నించారు. వైసీపీకి చెందిన హనుమంతు, సురేంద్ర, ఓబులపతి, నవీన్‌లతోపాటు 20మంది దాడి చేసినట్లు టీడీపీ నాయకులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దాడి నేపథ్యంలో గ్రామంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు.

అక్కా.. బాగున్నారా..!



విజయమ్మతో మాట్లాడుతున్న జేసీ ప్రభాకర్‌రెడ్డి

తాడిపత్రి, జూలై 29: హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో సోమవారం వైఎస్ విజయమ్మను టీడీపీ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కలిశారు. చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోగ్య పరీక్షల నిమిత్తం ఆసుపత్రికి వెళ్లగా వెయిటింగ్‌హాలులో ఉన్న వైఎస్ విజయమ్మను జేసీపీఆర్ గమనించారు. వెంటనే ఆమె వద్దకు వెళ్లి 'అక్కా.. బాగున్నారా..?' అని పలకరించారు. ఆరోగ్య పరిస్థితులపై ఆరాతీశారు. ఇరువురు కుటుంబ సభ్యుల బాగోగులపై ఆరాతీసినట్లు సమాచారం.

డిగ్రీ పరీక్షల్లో 98 శాతం ఉత్తీర్ణత

అనంతపురం సెంట్రల్, జూలై 29: ఎస్కేయూ ఆధ్వర్యంలో నిర్వహించిన డిగ్రీ ఇన్‌స్టంట్ పరీక్షల్లో 98శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారు. సోమ వారం పరీక్షల నిర్వహణ విభాగాధిపతి ప్రొఫసర్ జీవీ రమణ ఆధ్వర్యంలో ఇన్ చార్జ్ వీసీ ప్రొఫెసర్ అనిత ఫలితాలను విడుదలచేశారు. ఆమె మాట్లాడుతూ డిగ్రీ చివరి సంవత్సరంలో సబ్జెక్టులు ఫెయిల్ అయి పీజీ ప్రవేశాలకు విద్యార్థులు దూరంగా ఉండకూడదన్న ఉద్దేశంత్ ఇన్‌స్టంట్ పరీక్షలు నిర్వహించా మన్నారు. 324మంది పరీక్షలకు నమోదుచేసుకోగా 319మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. వీరిలో కేవలం ఐదుగురు మాత్రమే ఫెయిల్ అయ్యారన్నారు.

చంద్రబాబు పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు: డీఐజీ



పర్యటన స్థలాన్ని పరిశీలిస్తున్న డీఐజీ, టీడీపీ నాయకులు

మడకశిర, జూలై 29: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వచ్చే నెల 1న గుండుమల గ్రామంలో పర్యటిస్తున్నారని, పకడ్బందీగా ఏర్పాట్లు చేపట్టాలని డీఐజీ షీమూషి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం గుండుమల గ్రామంలో చంద్రబాబు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. హెలీప్యాడ్ స్థలాన్ని ప్రజా వేదిక స్థలాన్ని పింఛన్లు పంపిణీ చేసే ఇళ్ల వద్ద పరిశీలించారు. సీఎం పర్యటనకు రెండు రోజులే ఉన్న నేపథ్యంలో ఏర్పాట్లను వేగవంతం చేయాలని, బందోబస్తుకు సంబంధించిన విషయాలను చర్చించారు. జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్‌కుమార్, సబ్‌కలెక్టర్ అపూర్వభరత్, కదిరి ఆర్డీఓ వంశీకృష్ణ, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామితోపాటు డీఎస్పీ బాజీజాన్‌సైదా, సీఐ, ఎస్ఐలతో కలిసి ఏర్పాట్లపై చర్చ జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు వస్తున్న నేపథ్యంలో చిన్న పొరపాట్లకు తావులేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని పలు సూచనలు చేశారు. పింఛన్ల పంపిణీ సమయంలో ఇళ్ల వద్దకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా వెళ్లనున్న నేపథ్యంలో ఎలాంటి బందోబస్తు చేపట్టాలనే విషయంలో పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు జయప్ప, మాజీ సర్పంచ్ చంద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

తాడిపత్రి, జూలై 29: విద్యుదాఘాతంతో పెద్దపప్పూరు మండలం చెర్లోపల్లి గ్రామానికి చెందిన యువ రైతు హరినాథ్‌రెడ్డి (33) సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. హరినాథ్‌రెడ్డి తన తోటలో మోటార్ పైపులను పైకి తీయడానికి తురకపల్లికి చెందిన శేఖర్‌ను కూలికి కుదుర్చుకున్నాడు. పైన ఉన్న విద్యుత్ తీగలను గమనించకుండా ఇద్దరూ కలిసి మోటార్ పైపులను పైకి లాగారు. పైపులు.. తీగలకు తగలడంతో ఇద్దరికి విద్యుత్ షాక్ కొట్టింది. కూలి పనులకు వచ్చిన శేఖర్ తీవ్రంగా గాయపడి ఎగిరి అవతల పడ్డాడు. హరినాథ్‌రెడ్డి మాత్రం అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య హరిత, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. చికిత్స నిమిత్తం శేఖర్‌ను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.



రైతు హరినాథ్‌రెడ్డి మృతదేహం

గొర్రెల మందపై చిరుత దాడి

కుందుర్పి, జూలై 29: మండల కేంద్రంలోని గొర్రెల మందపై చిరుత సోమవారం దాడి చేసింది. కాపరి వెంకటస్వామి జగనన్న కాలనీ పక్కన ఏర్పాటు చేసుకున్న దొడ్డిలోకి సాయంత్రం గొర్రెలను వదిలి పక్కనే ఉన్న ఇంట్లోకి వెళ్లాడు. గొర్రెలు అరవడంతో ఆయన బయటకు వచ్చాడు. మందలో చిరుత జొరబడటాన్ని గమనించి గట్టిగా కేకలు వేశాడు. చుట్టుపక్కల వారు అక్కడకు రావడంతో చిరుత పక్కనే ఉన్న కొండ ప్రాంతంలోకి వెళ్లిపోయింది. చిరుత దాడిలో ఓ గొర్రె మృతిచెందిందని కాపరి తెలిపారు.



ఎలుగుబంటి సీసీ ఫుటేజీ

గోడౌన్‌లోకి చొరబడ్డ ఎలుగుబంటి

కళ్యాణదుర్గం: పట్టణంలోని మార్కెట్ యార్డు ఎదురుగా ఉన్న బిస్కెట్స్ ఏజెంట్స్ నిర్వాహకులు కరణం రాఘవేంద్ర గోడౌన్‌లోకి సోమవారం తెల్లవారుజామున ఎలుగుబంటి చొరబడి బీభత్సం సృష్టించింది. బాత్రూమ్ తలుపులు పగులగొట్టి బిస్కెట్ బాక్సులు చించేసింది. బిస్కెట్లన్నీ తినింది. ఈదృశ్యాలన్నీ సీసీ కెమెరాలో రికార్డు కావడంతో విషయం బయటపడింది. చుట్టూ జనావాసాలున్నా చీకటిపడితే చాలు ఎలుగుబంట్ల బెడద ఎక్కువైంది. పట్టణంలోని నాయీబ్రాహ్మణకాలనీ, పూర్ణానంద ఆశ్రమం పరిసరాల్లో నిత్యం ఎలుగుబంటి సంచరిస్తోందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

బాల్యం చదువుకోసం.. పెళ్లి కోసం కాదు..
● పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టరు


బాల్యవివాహాల నిర్మూలనలో ప్రతిభ కనబరిచిన రజియాను సత్కరిస్తున్న కలెక్టరు

అనంతపురం టౌన్, జూలై 29: బాల్య వివాహాలవల్ల కలిగే అనర్థాలపై ప్రజలకు అవగాహన కల్పించడం కోసం ఐసీడీఎస్ శాఖ బాల్యం చదువుకోసం.. వివాహం కోసం కాదు అంటూ ప్రత్యేక స్లోగన్‌తో పోస్టర్లు ముద్రించారు. పోస్టర్లను సోమవారం రెవెన్యూభవన్‌లో కలెక్టరు వినోద్ కుమార్ చేతులు మీదుగా ఆవిష్కరించారు. ఇదే సమయంలో గార్లదిన్నె మండలం కల్లూరుకు చెందిన రజియాబేగం బాల్యవివాహాల నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించడంలో మంచి ప్రతిభ కనబరుస్తుండటంతో ఆమెను కలెక్టరు అవార్డు, ప్రశంసాపత్రం అందజేసి అభినందించారు. ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా చైల్డ్‌ప్రొటెక్షన్ అధికారి మంజునాథ్, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ కృష్ణమాచారి పాల్గొన్నారు.

సైనికపురంలో మౌలిక వసతులు కల్పించండి


మంత్రి కేశవ్‌తో కెప్టెన్ షేకన్న

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 29: ఉరవకొండ నియోజకవర్గంలోని కూడేరు సమీపంలో ఏర్పాటుచేసిన సైనికపురంలో మౌలిక వసతులు కల్పించాలని ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌ను మాజీ సైనికుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కెప్టెన్ షేకన్న కోరారు. ఈ మేరకు సోమవారం మంత్రి నివాసానికి వెళ్లిన షేకన్న ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలు విన్నవించారు. షేకన్న మాట్లాడుతూ... మీ సహకారంతోనే సైనికపురాన్ని ఏర్పాటు చేశామన్నారు. కాలనీల్లో సీసీ రోడ్లు, విద్యుత్, తాగునీరు, బస్‌స్టాప్ సౌకర్యాలను కల్పించాలని కోరారు. ప్రభుత్వం నుంచి మాజీ సైనికులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని కోరారు.

పూడికతీత పనులు వేగవంతం చేయండి


అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్

అనంతపురం క్రైం, జూలై 29: నగరంలో పూడికతీత పనులు వేగవంతం చేయాలని నగర కమిషనర్ పీవీవీఎస్ మూర్తి అధికారులను ఆదేశించారు. సోమవారం నగరంలోని నడిమి వంకలో జరుగుతున్న పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా నగరంలో అన్ని ప్రాంతాల్లో చిన్న, పెద్ద కాలువలు పూడిక తీయాలన్నారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూడాలని ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈఈ సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు భరోసా కలిగేలా విధులుండాలి: ఎస్పీ


స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ

అనంతపురం క్రైం, జూలై 29: పోలీస్‌స్టేషన్లకు బాధలతో వచ్చే ప్రజలకు భరోసా కలిగేలా పోలీసుల విధులుండాలని ఎస్పీ కేవీ మురళీకృష్ణ అన్నారు. సోమవారం ఎస్పీ నగరంలోని టూటౌన్, ట్రాఫిక్, రూరల్ పోలీస్‌స్టేషన్లను తనిఖీ చేశారు. పోలీస్‌స్టేషన్లలోని లాకప్ గదులు, రిసెప్షన్, కంప్యూటర్ రూమ్, జీడీ, రికార్డుల నిర్వహణ, పోలీస్‌స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. యూఐ కేసుల్లో పురోగతి సాధించాలన్నారు. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాల రవాణా, విక్రయించే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. టూటౌన్ సీఐ క్రాంతికుమార్, రూరల్ సీఐ రామక్రిష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీసుల చొరవ అభినందనీయం

అనంతపురం సెంట్రల్, జూలై 29: కూటమి ప్రభుత్వం ఏర్పాటుతో పోలీసులు చూపుతున్న చొరవ అభినందనీయమని ప్రభుత్వ ఆసుపత్రిలో మిస్సింగ్ అయిన బాలికను మూడు గంటల్లో తల్లివద్దకు చేర్చడం ఇందుకు నిదర్శనమని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి అన్నారు. సోమవారం ఎస్పీ మురళీకృష్ణను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నాయకులు రామకృష్ణ, కేశవనాయక్, రామ్మోహన్, ఓబులేసు, నారాయణస్వామి, ఈశ్వరయ్య, రవి పాల్గొన్నారు.

బలిజ మహాసంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకరయ్య


శంకరయ్యను గజమాలతో సత్కరిస్తున్న సంఘం నాయకులు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 29: రాయలసీమ బలిజ మహాసంఘం జిల్లా అధ్యక్షుడిగా తొండపునాటి శంకరయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన జిల్లా కార్యవర్గ సమావేశంలో శంకరయ్యను ఎంపిక చేశారు. ఆయన మాట్లాడుతూ బలిజ సంఘం అభివృద్ధి, నాయకులు అభ్యున్నతికి తనవంతు సహాయసహకారాలందిస్తానన్నారు. ఎన్నికకు సహకరించిన జిల్లా కార్యవర్గ సభ్యులకు పేరుపేరును ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. గౌరవాధ్యక్షులు పాములాయి వెంకటేష్, కోశాధికారి కోనేటి సాయిప్రసాద్, యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, నాయకులు బళ్లారి వెంకటరాముడు, దండు శ్రీనివాసులు, నాగభూషణం పాల్గొన్నారు.

బహుజనులకు ఇంటి స్థలాలు కేటాయించాలి

అనంతపురం రూరల్, జూలై 29: ఇళ్లులేని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బహుజనులకు ఇంటి స్థలాలు కేటాయించాలని బీఎస్పీ నాయకులు కోరారు. సోమవారం అనంతపురంరూరల్ డిప్యూటీ తహసీల్దార్ దివాకర్‌కు వినతి పత్రం ఇచ్చారు. పార్టీ జిల్లా ఇన్‌చార్జ్ నాగరాజు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో అర్హులైన చాలా మందికి ఇంటి స్థలాలను మంజూరు చేయలేదన్నారు. కమిటీ సభ్యులు కుళ్లాయప్ప, ఆర్గనైజింగ్ కార్యదర్శి హరిప్రసాద్, అనంతపురం నియోజకవర్గం అధ్యక్షుడు హేమసుందర్, కన్వీనర్ గంగాధర్, జిలాన్ బాషా, అబ్దుల్ గఫూర్ పాల్గొన్నారు.

1 నుంచి తల్లిపాల వారోత్సవాలు

అనంతపురం విద్య, జూలై 29: జిల్లాలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆగస్టు 1 నుంచి తల్లిపాల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 1 నుంచి 7వ తేదీ వరకు వారోత్సవాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది గృహాలను సందర్శించాలన్నారు.

తిథి భోజనం కార్యక్రమానికి చేయూతనివ్వండి

ధర్మవరం రూరల్(కనగానపల్లి), జూలై 29: ప్రభుత్వ పాఠశాలలో ప్రతిసోమవారం ఏర్పాటుచేసే తిథి భోజనానికి దాతలు చేయూత అందించాలని ఎంఈఓ అరుణమ్మ కోరారు. స్థానిక ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్ అంకే పరిమిశ రామకృష్ణ సోమవారం విద్యార్థులకు తిథి భోజనం కింద స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సరిపూటి బాలయ్య, తెలుగుయువత బట్టాసురేష్‌చౌదరి, చల్లా సోము, వన్నూరప్ప, హరి, గోపాల్ పాల్గొన్నారు.


విద్యార్థులకు స్వీట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

పారదర్శకంగా క్లబ్ నిర్వహించాలి

● ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్


ఎమ్మెల్యేకు స్వాగతం పలుకుతున్న అనంతపూర్ క్లబ్ సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 29: అనంతపూర్ క్లబ్‌లో ఎటువంటి వివాదాలు, రాజకీయ, కుల, మతాలకు తావు లేకుండా పారదర్శకంగా నిర్వహించాలని ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వర ప్రసాద్ సూచించారు. 78ఏళ్ల చరిత్ర కలిగిన అనంతపూర్ క్లబ్‌ను సోమవారం ఆయన సందర్శించారు. క్లబ్ సభ్యులు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. క్లబ్ గత ఐదేళ్లుగా వివాదాలకు కేంద్రంగా మారడం బాధాకరమని, ఇది ఒక సేవాకేంద్రంగా ఉండాలన్నారు. ఎటువంటి అవకతవకలు లేకుండా క్లబ్‌ను మేధావులకు నిలయంగా నిర్వహించాలని సూచించారు. ఎన్నికల నోటిఫికేషన్‌తో మొదలు ఎన్నికల అధికారి, ప్రక్రియ మొత్తం బహిరంగపరిచి నిర్వహించాల్సిన పరిస్థితి ఉందన్నారు. మెజార్టీ సభ్యులు క్లబ్ నిర్వహణ, కార్యకలాపాలు, ఆర్థిక లావాదేవీలపై విచారణ జరపాలని ఎమ్మెల్యేని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ క్లబ్‌పై సంబంధిత అధికారులతో మాట్లాడి పారదర్శకతకు పెద్దపీట వేయాలన్నారు. నిధుల వినియోగం, సభ్యత్వ నమోదు, కొత్త సభ్యుల చేరిక, ఓటర్ల జాబితా తయారు బైలా ప్రకారం చేయాలని సూచించారు.

ఎమ్మెల్యే పరామర్శ


అశ్వర్థనాయుడిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

రాప్తాడు, జూలై 29: మండలం గాండ్లపర్తి గ్రామానికి చెందిన పెద్దింటి అశ్వత్థనాయుడు అనారోగ్యానికి గురై అనంతపురం నగరంలో నివాసం ఉండటంతో, విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పరిటాల సునీత సోమవారం ఉదయం ఇంటికి వెళ్లి ఆయనను పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని ఆరా తీశారు. అనంతరం ఆత్మకూరుకు చెందిన గంగవరం రవీంద్రనాథ్ రోడ్డు ప్రమాదంలో గాయపడి ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా వెళ్లి పరామర్శించారు. కార్యక్రమంలో పరిటాల సునీత సోదరులు ధర్మవరపు మురళి, బాలాజీ, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఐ-టీడీపీ అధ్యక్షుడికి...


జిల్లా జైలు నుంచి బయటకు వస్తున్న వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, జూలై 29: ఓ కేసుకు సంబంధించి జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఐటీడీపీ జిల్లా అధ్యక్షుడు పులికొండ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులను టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ సోమవారం కలిసి పరామర్శించారు. ఆయన వెంట కురబ సాధికార సమితి రాష్ట్ర డైరెక్టర్ నారాయణస్వామి ఉన్నారు.

పెన్షనర్స్ పితామహుడు నకారాకు నివాళి

అనంతపురం ప్రెస్‌క్లబ్, జూలై 29: ప్రభుత్వ పెన్షనర్ల పితామహుడు నకారా వర్ధంతిని జిల్లా పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. సోమవారం ఆ సంఘం కార్యాలయంలో జిల్లా ప్రధాన కార్యదర్శి శీలా జయరామప్ప ఆధ్వర్యంలో నకారా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. శీలా జయరామప్ప మాట్లాడుతూ నకారా పెన్షనర్ల కోసం చేసిన కృషి, సేవలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గోవిందరాజులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ ప్రభాకర్, జిల్లా కోశాధికారి రామకృష్ణ, సహాధ్యక్షులు ఖలందర్, ఉపాధ్యక్షులు డేనియల్ ప్రభాకర్, నారాయణ, రమేష్‌కుమార్, సంయుక్త కార్యదర్శులు చంద్రశేఖర్ రెడ్డి, కిష్టప్ప, వేణుగోపాల్, జయరాం, సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు రమణ పాల్గొన్నారు.

4న జిల్లా క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 29: జిల్లా బాలుర అండర్-14 క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు ఆగస్టు 4వతేదీన అనంత క్రీడాగ్రామం ఆర్డీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి మధు ఆచారి తెలిపారు. 2012 ఆగస్టు 31వతేదీ నుంచి 2010 సెప్టెంబరు 1వతేదీ మధ్యలో జన్మించిన క్రీడాకారులు అర్హులన్నారు. ఆసక్తి, అర్హత గల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, స్టడీసర్టిఫికెట్, క్రీడాసామగ్రి, యూనిఫాంతో హాజరుకావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9866157250 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘంలో నలుగురికి చోటు

అనంతపురంరూరల్, జూలై 29: రాష్ట్ర వ్యవసాయ మార్కెట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘంలో ఉమ్మడిజిల్లా నుంచి నలుగురికి చోటు దక్కింది. ప్రకాశం జిల్లాలో సంఘం రాష్ట్రస్థాయి కార్యవర్గ నిర్వహించారు. ఇందులో ఉరవకొండ మార్కెట్ యార్డు అసిస్టెంగ్‌గా పనిచేస్తున్న సుధాకర్ యాదవ్‌కు వర్కింగ్ కార్యదర్శిగా ఎన్నుకొన్నారు. అనంతపురంలో పనిచేస్తున్న యార్డు అసిస్టెంట్ మారెన్నను ఉపాధ్యక్షులుగా, రాయదుర్గం యార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఈశ్వరప్పను సహాయ కార్యదర్శిగా, హిందుపురం యార్డులో పనిచేస్తున్న ఆదినారాయణను కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకొన్నారు.

సెంట్రల్ యూనివర్సిటీలో ఇద్దరికి సీటు


విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ దివాకర్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, జూలై 29: డిగ్రీ రసాయన శాస్త్రం పూర్తి చేసిన విద్యార్థులకు సెంట్రల్ యూనివర్సిటీలో ఇద్దరికి పీజీ సీట్లు వచ్చినట్లు ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ దివాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం విద్యార్థులను అభినందించిన ఆయన పీజీ కోర్సులు అభ్యసించడానికి ప్రతి కోర్సునుంచి సెంట్రల్ యూనివర్సిటీకి విద్యార్థులు వెళ్తున్నారని ఇది వారి భవిష్యత్తుకు శుభసూచకమని కొనియాడారు. అధ్యాపకులు కిరణ్, రామకృష్ణ, బృంద, విజయలక్ష్మి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అవసరం


కరాటే ప్రదర్శన ఇస్తున్న విద్యార్థులు

అనంతపురం విద్య, జూలై 29: వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు, పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని వక్తలు సూచించారు. సోమవారం భాష్యం విద్యాసంస్థల్లో ఫ్రెషర్స్‌డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా డాక్టర్ విష్ణుభాస్కర్, రమ్యతేజ హాజరై విద్యార్థులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. అనంతరం చిన్నారులు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే ప్రదర్శన ఆకట్టుకున్నాయి. విద్యాసంస్థల జెడ్ఈఓ రవివర్మ, ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్, హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు


మంత్రి సత్యకుమార్‌ను సత్కరిస్తున్న గుడిసె దేవానంద్

అనంతపురం సెంట్రల్, జూలై 29: వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను బీజేపీ రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు గుడిసె దేవానంద్ కలిసి సన్మానించారు. సోమవారం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిని సందర్శించిన మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించినట్లు దేవానంద్ తెలిపారు. ఎస్సీమోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రభుకుమార్, నాయకులు ఆనంద్, ఆదినారాయణ పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ల సీజ్

శింగనమల, జూలై 29: మండలంలో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను ఎస్ఐ చంద్రశేఖర్ సీజ్ చేశారు. ఆదివారం రాత్రి మండలంలోని జూలాకాలువ గ్రామ సమీపంలో ఇసుక తరలిస్తున్న రెండు టిప్పర్లను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

రిమాండ్‌కు పేకాటరాయుళ్లు

గార్లదిన్నె, జూలై 29: మండలంలోని మర్తాడు క్రాస్ వద్ద ఆదివారం పట్టుబడిన పేకాటరాయిళ్లను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ గౌస్ బాషా తెలిపారు. మర్తాడు క్రాస్‌లోని ఓ చీనీతోటలో 10 మందిని అరెస్టు చేసిన వవిషయం తెలిసిందే. అరెస్టు అయిన 10 మందిలో గతంలో కేసు లున్న ఐదుగురిని సోమవారం రిమాండ్‌కు తరలించామన్నారు.

ఫ్లైఓవర్ ఏర్పాటు చేయండి

శింగనమల, జూలై 29: అనంతపురం-విజయవాడ హైవే రోడ్డు పనుల్లో భాగంగా శింగనమల మరవకొమ్మ వద్ద ఫ్లైఓవర్ ఏర్పాటు చేయాలని టీడీపీ నాయకులు కోరారు. సోమవారం నాయకులు చాకలి వెంకటేశ్, పెద్దనాగముని, ఆదినారాయణ, బండి వెంకటనారాయణ, మసూద్‌వలి, శివకుమార్, రాయల్ సత్తి, ఎర్రిస్వామి బ్రిడ్జి ఏర్పా టు చేయాలని తహసీల్దార్ ప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ శింగనమల నుంచి అనంతపురం వెళ్లేందుకు శివపురం పెద్దమ్మ గుడి వద్ద రోడ్డు పనులు జరుగుతున్నాయని, ప్రజలకు అక్కడ ఇబ్బంది లేకుండా ఫ్లైఓవర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరారు.

రైతులకు మెరుగైన సేవలు అందించాలి

అనంతపురం అర్బన్, జూలై 29: రైతులకు మెరుగైన సేవలు అందించేందుకు ప్రత్యేక చొరవ చూపాలని అనంతపురం ఏడీఏ రవి ఆదేశించారు. సోమవారం స్థానిక అనంతపురం ఏడీఏ కార్యాలయంలో డివిజన్ పరిధిలోని ఏఓలు, ఏఈఓలతో ఆయన సమావేశమయ్యారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు మట్టి నమూనాలు సేకరించి, పరీక్షా కేంద్రానికి పంపాలన్నారు. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సన్నద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. రైతు సేవ కేంద్రం వారిగా ఎంత మోతాదులో ప్రత్యామ్నాయ విత్తనాలు అవసరమన్న వివరాలు పంపాలని సూచించారు. ఏఓలు శశికళ, సోమశేఖర్, సుచరిత, శ్యాంసుందర్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఏఈఓలు మురళీకృష్ణ, సుజిత, అలేఖ్య, శిరీష, రంజిత రాణి, శైలజ, స్రవంతి పాల్గొన్నారు.

దక్షిణ కాలువకు నీరు విడుదల చేయాలి

గార్లదిన్నె, జూలై 29: ఎంపీఆర్ డ్యాం దక్షిణ కాలువకు సాగునీరు విడుదల చేయాలని రాయలసీమ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అక్బర్ డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్‌ను రైతులతో ఆయన తహసీల్దార్‌ను కలిశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని డిప్యూటీ తహసీల్దార్‌కు అందచేశారు.

పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరించండి

అనంతపురం న్యూటౌన్, జూలై 29: పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని పంచాయతీ కార్యదర్శుల సంఘం నాయకులు డైరెక్టర్ కృష్ణతేజను కలిసి విన్నవించారు. ప్రధానంగా కార్యదర్శుల పదోన్నతులు, క్లస్టర్ల అప్‌గ్రేడ్‌లు, జీఓనెంబర్ 84 సవరణ గురించి పరిశీలించాలన్నారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు వర్ల శంకర్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, ఖాదర్ బాషా, వెంకటేష్, షేక్షావలి, సాయిరామ్ పాల్గొన్నారు.

స్కూల్, కాలేజీ నిర్మాణాలకు స్థలం కేటాయించండి

అనంతపురంరూరల్, జూలై 29: మండలంలోని కురుగుంట, చిన్నంపల్లి, కామారుపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాల, జూనియర్ కళాశాల నిర్మాణానికి స్థలం కేటాయించాలని కార్మిక హక్కుల సంరక్షణ సంఘం నాయకులు కోరారు. ఎమ్మెల్యే పరిటాల సునీతకు వారు వినతి పత్రం ఇచ్చారు. సంఘం జిల్లా అధ్యక్షుడు రవి మాట్లాడుతూ.. ఆయా గ్రామాల్లోని విద్యార్థులు ఇంటర్ విద్య కోసం నగరానికి వెళుతున్నారన్నారు. సంఘం ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, సగ్గిలి మధు పాల్గొన్నారు.

బయో ఎరువులు సీజ్


బయో ఎరువులను సీజ్ చేస్తున్న ఏడీఏ రవి

అనంతపురం అర్బన్, జూలై 29: అక్రమంగా తరలిస్తున్న లిక్విడ్ బయో ఎరువులను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం నగరంలో స్వాధీనం చేసుకున్నారు. జనక్స్ కంపెనీకి చెందిన రూ.2.40 లక్షల విలువైన 1000 లీటర్ల బయో ఎరువులను అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకుని సీజ్ చేశామని ఏడీఏ రవి తెలిపారు. రాము అనే వ్యక్తి హైదరాబాద్ నుంచి అనంతపురం నగరానికి ఈ ఎరువులను తెచ్చినట్లు గుర్తించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి తదుపరి చర్యలు తీసుకుంటామని ఏడీఏ తెలిపారు. అనంతపురం ఏఓ శశికళతో కలిసి వాహనాన్ని పట్టుకున్నామని తెలిపారు.

దౌర్జన్యాలు, ఆక్రమణలు వైసీపీకే చెల్లు: టీడీపీ

రామగిరి, జూలై 29: దౌర్జన్యాలు, దోపిడీలు, ఆక్రమణలు చేయడం వైసీపీనాయకులకే చెల్లుతుందని టీడీపీ నాయకులు విమర్శించారు. సోమవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మండల కన్వీనర్ సుధాకర్‌తోపాటు టీడీపీ నాయకులు మాట్లాడారు. తమకు తోచిన విధంగా రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతపై విమర్శించడ సిగ్గుచేటన్నారు. మీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి పనులకు సంబంధించిన శిలాఫలకాలు పేర్లు దౌర్జన్యంగా తొలగించారని, ముఖ్యంగా కొత్తగాదికుంట గ్రామంలో తిప్పన్న కుటుంబసభ్యులకు సంబంధించిన భూసమస్యపై ఏదేదో మాట్లాడటం సరికాదన్నారు. అందుకు సంబంధించి పూర్తి వివరాలు తమ వద్ద ఉన్నాయని ఆ కుటుంబసభ్యులు తిప్పన్న పేర్కొన్నారు. కోర్టులో తీర్పు కూడా మాకు అనుకూలంగా వచ్చిందని అయితే ముత్యాలు చదువురాని మా అన్నదమ్ములతో మోసపూరితంగా బొటన వేలు ముద్రలు వేయించుకుని తమదే భూమి అంటూ రికార్డులు సృష్టించుకున్నారన్నారు. ఎమ్మెల్యే పరిటాలసునీతపై లేనిపోని నిందలు వేస్తే తగినవిధంగా బుద్ధిచెబుతామని హెచ్చరించారు. తెలుగు యువత అధ్యక్షుడు లింగా శ్రీధర్‌నాయుడు, ఎస్సీసెల్ పోతన్న, వెంకటరాముడు, ఎంపీటీసీ శ్రీనివాసులు, పేపర్ శీన, గుర్రం శీన, విశ్వనాథ్, బాలరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రగతిశీల మానవతావాద కవి సినారె


సినారె చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీకారులు

అనంతపురం కల్చరల్, జూలై 29: తెలుగు భాషకు వెలుగులు నింపిన ప్రగతిశీల మానవతావాద కవి సినారె అని పలువురు వక్తలు కొనియాడారు. జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, సినారెగా పేరు ప్రఖ్యాతలు గడించిన డాక్టర్ సి నారాయణరెడ్డి 93వ జయంతిని మహాకవి గుర్రం జాషువా సాహిత్య పీఠం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక విశాలాంధ్ర బుక్‌హౌస్‌లో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్కేయూ తెలుగు శాఖ అకడమిక్ కన్సల్టెంట్ డాక్టర్ నానీల నాగేంద్ర మాట్లాడుతూ సినారె తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసిన బహుముఖ ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. జాషువా సాహిత్యపీఠం ప్రధాన కార్యదర్శి నాగలింగయ్య మాట్లాడుతూ సాధారణ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన నారాయణరెడ్డి అత్యున్నత జ్ఞానపీఠ్ అవార్డు పొందే స్థాయికి ఎదిగిన తీరు ఎంతోమందికి ఆదర్శదాయకమని కొనియాడారు. పూజారి ఈరన్న, అనంత సాహితీ ప్రస్థానం అధ్యక్షుడు గంగిరెడ్డి అశ్వత్థరెడ్డి, షేక్ రియాజుద్దీన్, టీవీ రెడ్డి, నిమ్మల వరప్రసాద్, పాటిల్ హరీష్, చెట్ల ప్రవీణ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

శోత్రియం భూములను రక్షించండి


ఇన్‌చార్జి జేసీకి వినతి పత్రం ఇస్తున్న రాజేష్

అనంతపురం ప్రెస్ క్లబ్, జూలై 29: అనంతపురం రూరల్ మండలం గొల్లపల్లి రెవెన్యూ గ్రామంలో వైసీపీ నాయకుల చేతుల్లో ఉన్న శోత్రియం భూములను రక్షించాలని బీజేపీ ఉరవకొండ అసెంబ్లీ కన్వీనర్, కురుబ సంఘం నాయకుడు కొనకొండ్ల రాజేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో ఇన్‌చార్జ్ జేసీ రామకృష్ణారెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. రాజేష్ మాట్లాడుతూ గొల్లపల్లి గ్రామంలో పేద రైతులకు చెందిన 15.50 ఎకరాలు మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి అనుచరులైన వీరన్న, రమణ, మంజులాదేవి కలిసి తమపేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారన్నారు. ప్రస్తుతం ఆ భూముల్లో ప్లాట్లను వేసి అమ్ముకోవాలనే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ఈ విషయంలో అధికారులు స్పందించి ఆ భూములను వైసీపీ నేతల పేర్ల మీద రద్దు చేసి స్థానికంగా అర్హులైన రైతులకు అందించాలని కోరారు.

అనుమానాస్పద స్థితిలో చిరుత మృతి


చిరుత కళేబరాన్ని పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు

అనంతపురం న్యూటౌన్, జూలై 29: అనంతపురం రేంజ్ వడ్డిపల్లి బీట్ పంపనూరు రిజర్వు ఫారెస్టులో అనుమానాస్పద స్థితిలో చిరుతపులి మృతి చెందినట్లు రేంజర్ శ్రీనివాసులు తెలిపారు. గొర్రెల కాపర్లు వాసన చేసి స్థానికులకు సమాచారం ఇవ్వడంతో.. వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. స్పందించిన రేంజర్ సిబ్బందితో కలిసివెళ్లి పరిశీలించారు. వెటర్నరీ అసిస్టెంట్ దిలీప్ కుమార్‌కు సమాచారం అందించారు. ఆయన చిరుతపులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. వృద్ధాప్యం కారణంగా, చాలా రోజులుగా తిండి, నీళ్లు తీసుకోకపోవడంతోనే మృతిచెందినట్లు వెల్లడించారు. అటవీశాఖ అధికారులు చిరుత కళేబరాన్ని ఖననం చేశారు. డీఆర్వో ఉసేనప్ప, ఎఫ్‌బీఓ జగదీష్, ఏబీఓ రామ్మోహన్ పాల్గొన్నారు.

ముగ్గురికి జీవిత ఖైదు

● స్నేహితుడిని హత్య చేసినందుకు..

అనంతపురం క్రైం, జూలై 29: నగరానికి చెందిన నలుగురు స్నేహితులు. దొంగతనాలు చేస్తుండేవారు. వారిలో ఒకరు పోలీసులకు చిక్కారు. విచారిస్తే.. మిగిలిన ముగ్గురి పేర్లను చెప్పాడు. దీంతో ఆ ముగ్గురికీ కోపం వచ్చింది. స్నేహితుడని చూడకుండా.. దారుణంగా చంపేశారు. ఈ కేసును విచారించిన కోర్టు.. తొమ్మిదేళ్ల తరువాత తీర్పును ప్రకటించింది. నేరం రుజువు కావడంతో ముద్దాయిలు ముగ్గురికీ అనంతపురం మహిళా కోర్టు న్యాయాధికారి శోభారాణి సోమవారం జీవిత ఖైదు విధించారు. కళ్యాణదుర్గం అర్బన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఈ కేసు నమోదైంది.

ఆ నలుగురూ..: అనంతపురం నగరానికి చెందిన భీమేష్, మారుతి, హనుమంతు, స్వర్ణరాజు స్నేహితులు. చిన్న చిన్న దొంగతనాలు చేసేవారు. ఓ కేసులో భీమేష్ పోలీసులకు చిక్కాడు. విచారిస్తే.. నలుగురి వ్యవహారం బయటపడింది. తమ పేర్లు చెప్పినందుకు భీమేష్‌పై మిగిలిన ముగ్గురికి కోపం వచ్చింది. 2015 ఫిబ్రవరిలో కళ్యాణదుర్గం శివారులోని ఓ మామిడితోటకు భీమేష్‌ను తీసుకెళ్లారు. ముగ్గురూ కలిసి హత్య చేశారు. ఆనవాళ్లు గుర్తుపట్టకుండా అతని తలపై రాయితో మోదారు. అప్పటి ఎస్ఐ జయనాయక్ హత్య కేసు నమోదు చేశారు. అప్పటి సీఐ మన్సూరుద్దీన్ దర్యాప్తు చేపట్టి, సమగ్ర నివేదికను కోర్టుకు సమర్పించారు. అన్ని కోణాల్లో విచారించిన అనంతపురం మహిళా కోర్టు న్యాయాధికారి.. ముగ్గురికీ జీవితఖైదు విధించారు. చెరో రూ.5 వేలు జరిమానా విధించారు. ఈ కేసును ప్రాసిక్యూషన్ తరఫున అడిషనల్ పీపీ సృజన వాదించారు. డీసీఆర్‌బీ సీఐ సుబ్రహ్మణ్యం పర్యవేక్షణలో కోర్టులైజన్ ఏఎస్ఐ శ్రీనివాసులు, హెడ్‌కానిస్టేబుల్ సౌరెడ్డి, కానిస్టేబుల్ కృష్ణ మోహన్ సాక్షులను సకాలంలో కోర్టుకు హాజరు పరిచారు. నిందితులు శిక్ష పడేలా చేసినందుకు ఎస్పీ కేవీ మురళీకృష్ణ వారిని అభినందించారు.

ప్రజలకు సురక్షిత నీరు అందిస్తాం


బొమ్మేపర్తిలో తాగునీటిని అందిస్తున్న మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి

రాప్తాడు, జూలై 29: పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందిస్తామని టీడీపీ రాప్తాడు మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి తెలిపారు. మండలంలోని బొమ్మేపర్తిలో పరిటాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్‌ప్లాంట్‌ను సోమవారం టీడీపీ నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ వైసీపీ ఐదేళ్ల పాలనలో గ్రామాల్లో ప్రజలకు సురక్షిత నీరు అందించకపోవడంతో ఎంతో ఇబ్బంది పడ్డారన్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ఆదేశాల మేరకు అన్ని గ్రామాల్లో వాటర్‌ప్లాంట్‌లు ఏర్పాటు చేసి ప్రజలకు తక్కువ ధరకే నీరు అందిస్తామన్నారు. మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు పాల్గొన్నారు.

వామ్మో.. కరెంట్ బిల్లు..!

● ఎమ్మార్సీకి రూ. 98వేలు


జూలైలో కార్యాలయానికి వచ్చిన విద్యుత్ బిల్లు

గార్లదిన్నె, జూలై 29: ప్రతినెలా విద్యుత్ బిల్లు చెల్లిస్తున్నా విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ బిల్లులు ఇష్టానుసారంగా వేస్తున్నారని మండల విద్యాశాఖ అధికారి తారా చంద్రానాయక్ వాపోయారు. స్థానిక ఎమ్మార్సీ కార్యాలయానికి జూలై నెలకు సంబంధించి రూ.98వేలు బిల్లు వచ్చినట్లు ఆయన తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ కార్యాలయానికి సంబంధించిన బిల్లులను నెలనెలా ఫోన్‌పే ద్వారా చెల్లిస్తున్నామన్నారు. ఈనెలలో విద్యుత్ బిల్లు సంబంధిత కార్యాలయంలో చెల్లించేందుకు వెళ్లామన్నారు. బిల్లు రూ.98వేలు ఉందని విద్యుత్ శాఖ అధికారులు చెప్పడంతో ఖంగుతన్నంత పనైందన్నారు. ప్రతి నెలా బిల్లు చెల్లిస్తున్నామని, జూలై నెలకు రూ.98వేలు రావడం ఏమిటని అధికారులను ప్రశ్నించినట్లు తెలిపారు. మీ పాఠశాలకు సంబంధించిన పాత బిల్లులు ఉన్నాయన్నారు. కరోనా సమయంలో ఒక పాఠశాలకు సంబంధించిన బిల్లును ఇలానే మా కార్యాలయానికి పంపారని, తప్పని పరిస్థితుల్లో బిల్లు చెల్లించామని ఆయన వాపోయారు. ప్రతిసారి ఇలా మా కార్యాలయానికి ఎక్కడి బిల్లులులో వేస్తే మేం ఎలా కట్టాలని ఆవేదన వ్యక్తం చేసినట్లు తెలిపారు. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి తమకు వచ్చిన బిల్లును పరిశీలించాలని ఆయన కోరారు.

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి: కమిషనర్

గుత్తి, జూలై 29: మున్సిపల్ పరిధిలో అన్ని రకాల పన్నుల వసూళ్లను వేగవంతం చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. మున్సిపల్ పరిధిలో 2024-25 సంవత్సరం సంబంధించి పన్నుల వసూళ్లు, శానిటేషన్ తదితర అంశాలపై సచివాలయ కార్యదర్శులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... ఇంటి, నీటి పన్నులను, ట్రేడ్ లైసెన్స్‌లను వంద శాతం వసూలు చేయాలని ఆదేశించారు. శానిటేషన్, వీధి దీపాల నిర్వహణ, ఆక్రమ కట్టడాలు, తదితర వాటికి సంబంధించి విధులు సక్రమంగా నిర్వహించాలన్నారు. శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నెట్టికల్లు, సీనియర్ అసిస్టెంట్ రాజగోపాల్, ఏఈలు రవికుమార్, హరికిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటిన ఇళ్ల వద్దకే పింఛన్

కుందుర్పి, జూలై 29: ఆగస్టు ఒకటో తేదీన పింఛన్ దారుల ఇళ్ల వద్దకే వెళ్లి ఉదయం 6 గంటల నుంచి సాయంకాలానికి వందశాతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్ పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆయన ఆయన సోమవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఎన్టీఆర్ భరోసా పింఛన్లను అర్హులందరికీ పకడ్బందీగా పంపిణీ చేయాలని పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ దీపిక, ఏపీఎం హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గంరూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్న ఆగస్టు ఒకటో తేదీన ఎన్‌టీఆర్ భరోసా పింఛన్లను సజావుగా పంపిణీ చేయాని ఎంపీడీఓ అల్లా బకాష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటో తేదీన ఉదయం 6 గంటలకు గ్రామసచివాలయ సిబ్బంది, ఇతర శాఖల ఉద్యోగులు పింఛన్‌దారుడి ఇంటి వద్దకే పంపిణీ చేస్తారన్నారు. మొదటిరోజే అందరికీ పంపిణీ చేస్తారని, సాంకేతిక సమస్యలు తలెత్తితే రెండరోజు పంపిణీ చేస్తారని ఎంపీడీఓ తెలిపారు.

గుంతకల్లుటౌన్: ఎన్టీఆర్ సామాజిక భద్రత పింఛన్లను సచివాలయ సిబ్బంది ద్వారా ఆగస్టు1న ఇళ్ల వద్దకే పంపిణీ చేస్తారని ఎంపీడీఓ శ్రీకాంత్‌చౌదరి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల కోసం ఎవరూ సచివాలయాలకు, కార్యాయాలకు వెళ్ల వద్దని ఆయన కోరారు.

తాడిపత్రి/ పుట్లూరు / యాడికి: ఎన్టీఆర్ భరోసా పింఛన్లను ఇళ్లవద్దకే వచ్చి పంపిణీ చేస్తారని మున్సిపల్ కమీషనర్ రామ్మోహన్, పుట్లూరు ఎంపీడీఓ దస్తగిరి, యాడికి ఎంపీడీఓ సావిత్రి సోమవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. పింఛన్ దారులు ఒకటో తేదీన ఇంటివద్దనే ఉండి పింఛన్ తీసుకోవాలని కోరారు. సాంకేతిక కారణాలు తలెత్తితే రెండోతేదీ పంపిణీ చేస్తారని తెలిపారు.

తహసీల్దార్ రిలీవ్

పుట్లూరు, జూలై 29: మండల తహసీల్దార్ మల్లికార్జునస్వామి సోమవారం బదిలీ అయ్యారు. నుంచి సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయన కర్నూలు జిల్లా నుంచి మండలానికి వచ్చారు. అనంతరం బదిలీపై సొంత జిల్లాకు వెళ్లారు. ఈ మేరకు రిలీవ్ అయ్యారు. అధికారులు, సిబ్బంది ఆయనను సన్మానించారు.

అభ్యాస్ పాఠశాలలో చేర్పొద్దు: ఎంఈఓ

తాడిపత్రి, జూలై 29: పట్టణంలోని జయనగర్‌కాలనీ 12వరోడ్డులో ఉన్న అభ్యాస్ ఇంగ్లీషు మీడియం పాఠశాలలో తమ పిల్లలను చేర్పించవద్దని ఎంఈఓ నాగరాజు సోమవారం తల్లిదండ్రులను ఒక ప్రకటనలో కోరారు. పాఠశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించి తగినంత సిబ్బంది, ఇతర వసతులు లేనందువల్ల ఆ పాఠశాలలో పిల్లలను చేర్పించవద్దని ఆయన సూచించారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు

పుట్లూరు, జూలై 29: స్థానిక బీసీ సంక్షేమ హాస్టల్‌లో సోమవారం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వైద్యాధికారి శ్రీవాణి మాట్లాడుతూ... డయేరియాపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం భోజనాన్ని పరిశీలించారు.

అన్నదానానికి రూ.30 వేలు

పామిడి, జూలై 29 : పట్టణంలోని 5, 6వ వార్డులలో చిన్న పీర్ల పండుగ సందర్భంగా అన్నదానానికి ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్ రూ. 30వేలు వితరణ చేశారు. దీంతో ఆయా వార్డుల ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

కిరాణం షాపుల తనిఖీ

యల్లనూరు, జూలై29: మండలంలోని కిరాణం షాపులను సోమవారం డిప్యూటి తహసీల్దార్ శ్వేత తనిఖీ చేశారు. నిత్యావసర సరుకుల అమ్మకాలపై వినియోగదారులను అడిగి తెలుసుకున్నారు. కందిపప్పు, బియ్యం ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని సూచించారు. ఆమె వెంట వీఆర్వోలు ఉన్నారు.

టాక్సిమియాతోనే గొర్రెపిల్లల మృతి

● పశువైద్యాధికారి రమేష్

బెళుగుప్ప, జూలై 29: మండలంలోని దుద్దేకుంటలో ఆదివారం గొర్రెపిల్లలు టాక్సిమియా వ్యాధి తో మృతి చెందినట్లు పశువైద్యాధికారి రమేష్ బాబు తెలిపారు. గ్రామంలో ఎర్రిస్వామికి చెందిన పది, రమేష్‌కు చెందిన తొమ్మిది, హనుమంతరాయుడుకు చెందిన తొమ్మిది గొర్రె పిల్లలు అకస్మాత్తుగా మృతిచెందిన విషయం తెలిసిందే. పశువైద్యాధికారులు పరిశీలించి పోస్టుమార్టమ్ నిర్వహించారు. వ్యాధి తీవ్రతను గుర్తించడానికి నాలుగు కళేబరాలను పశువ్యాధి నిర్ధారణ విభాగానికి పంపినట్లు తెలిపారు. టీడీపీ నాయకులు తిమ్మప్ప, రమేష్, ప్రశాంత్, అశోక్ తదితరులు గొర్రెల కాపరులను పరామర్శించారు.

పేకాడుతున్న ఎనిమిది మంది అరెస్ట్

గుత్తి రూరల్, జూలై 29: మండలంలోని ఊబిచెర్ల గ్రామాశివారులోని కొండగుట్టలో సోమ వారం పేకాట స్థావరంపై పోలీసులు దాడులు చేసి పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టు చేశారు. పేకాట జరుగుతునట్లు సమాచారం అందడంతో సీఐ వెంకటరామిరెడ్డి, ఎస్ఐ నబీరసూల్ తమ సిబ్బందితో దాడులు చేశారు. ఎనిమిది మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.21 వేలు నగదు, నాలుగు బైకులు స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పుప్పాల గొడవలో ఆరుగురి అరెస్ట్

యాడికి, జూలై29: మండలపరిధిలోని పుప్పాల గ్రామంలో టీడీపీ, వైసీపీ వర్గీయుల మధ్య జరిగిన గొడవకు సంబంధించి వైసీపీకి చెందిన ఆరుగురిని సోమవారం అరెస్ట్‌చేసినట్లు సీఐ నాగార్జునరెడ్డి తెలిపారు. పుప్పాలలో ఈనెల 25న టీడీపీ, వైసీపీ వర్గీయులు గొడవ పడ్డారు. గొడవలో ఇరువర్గాలకు చెందిన నలుగురు గాయపడ్డారు. దీనిపై ఇరు వర్గీయుల ఫిర్యాదు మేరకు టీడీపీకి చెందిన ఎనిమిదిమందిపై, వైసీపీకి చెందిన 10మందిపై కేసు నమోదుచేసినట్లు సీఐ తెలిపారు. దర్యాప్తులో భాగంగా సోమవారం వైసీపీకి చెందిన ఆరుగురిని అరెస్ట్‌చేశామన్నారు. అరెస్ట్ అయిన వారిలో సుదర్శన్, రామాంజనేయులు, ఈశ్వరరెడ్డి, చిన్నవీరయ్య, గంగరాజు, రంగస్వామినాయక్ ఉన్నారు.

ప్రజాసంక్షేమమే ధ్యేయంగా పనిచేయండి

తప్పుచేసిన వారిని ఉపేక్షించం: ఎమ్మెల్యే కాలవ



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

డీ.హీరేహాళ్, జూలై 29: మండల వ్యాప్తంగా అన్ని గ్రామాలో టీడీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు అందించి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులందరూ పనిచేయాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేను టీడీపీ మండల నాయకులు ఘనంగా సత్కరించారు. అనంతరం అధికారులు ఆయా శాఖలకు సంబంధించి పథకాలు అమలును సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో రాష్ట్ర ఆర్థికవ్యవస్థ పూర్తిగా అంధకారంలో కూరుకు పోయిందన్నారు. తిరిగి రాష్ట్రాన్ని అభివృద్ధి బాటలో నడిపించే బాధ్యతను మన ముఖ్యమంత్రి చంద్రబాబు తీసుకున్నారని, అందుకు అనుగుణంగా ప్రజలకు సేవ చేయాలని అన్నారు. దీనికి మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు సమిష్టిగా సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఇట్టి తరుణంలో గ్రామాల్లో ప్రజావ్యవస్థకు ఇబ్బందులు కలుగజేస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించే ప్రసక్తే లేదన్నారు. గత ప్రభుత్వంలో కొంతమంది వైసీపీ నాయకులు అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక అక్రమాలకు పాల్పడ్డారని అన్నారు. ప్రజలు చైతన్యవంతులై వారి అక్రమాలను బహిరంగంగా వివరించేందుకు సిద్ధంగా ఉన్నారని, అధికారులు నిష్పక్షపాతంగా వాటిపై విచారించి అక్రమార్కులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరిస్తుందని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రఘునాథ్, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు నాగల్లి రాజు, మండల కన్వీనర్ హనుమంతరెడ్డి, మాజీ ఎంపీపీ మోహన్‌రెడ్డి, ఎంపీపీ పవిత్రవన్నూరుస్వామి, ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి, ఆయాశాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

కళ్యాణదుర్గం అభివృద్ధే మొదటి అజెండా

ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు



మహిళలతో సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, జూలై 29: నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే తన మదటి అజెండా అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు అన్నారు. తమ సమస్యలను విన్నవించుకోవడానికి పట్టణంలో సోమవారం నిర్వహించిన ప్రజావేదిక వద్దకు ప్రజలు, నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. ఎమ్మెల్యే తక్షణమే అధికారులతో మాట్లాడి అక్కడక్కడే పలు సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటణంతో పాటు గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేసే దిశగా అధికారులతో ప్రణాళికలు వేసుకుని ముందుకు సాగుతున్నామన్నారు. అదేవిధంగా ఆయా శాఖలకు వచ్చిన అర్జీలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు సూచిస్తున్నామన్నారు. ఏ ఒక్కరు సమస్యతో బాధపడకూడదన్నారు. నియోజకవర్గం అభివృద్ధే కర్తవ్యంగా ప్రణాళికలు రచిస్తున్నామని, అందుకోసం ఆయా శాఖల ముఖ్య అధికారులతో మాట్లాడుతున్నామన్నారు. ఇప్పటికే పట్టణంలో మౌలిక సదుపాయాల కల్పనకు, ఎక్కడెక్కడ సీసీ రోడ్లు, డ్రైనేజీలు ఏర్పాటు చేయాలో గుర్తిస్తున్నామన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో సర్వే చేపట్టి పక్కా ప్రణాళికలతో అభివృద్ధి చేస్తామన్నారు.

మంత్రికి వినతుల వెల్లువ



మంత్రికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఉరవకొండ, జూలై29: మండలంలోని నింబగల్లు సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను పరిశీలించేందుకు వచ్చిన ఆర్థిక శాఖమంత్రి పయ్యావుల కేశవ్‌కు వినతులు వెల్లువెత్తాయి. తమకు ఏడు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని ఆర్‌డబ్ల్యూఎస్ స్కీంలో పని చేస్తున్న వర్కర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. పట్టణంలో దళితులు వివాహాలు చేసుకునేందుకు సరైన సౌకర్యాలు లేవని, అందుకు కల్యాణమండపం కోసం స్థలాన్ని కేటాయించాలని ఎమ్మార్పీఎస్ నాయకులు మంత్రిని కోరారు. ఎస్సీ హాస్టల్ స్థలవివాదంపై ఆరేళ్ల నుంచి అధికారుల చుట్టూ తిరుగుతున్నా పరిష్కారం కాలేదని హాస్టల్ కమిటీ సభ్యులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. హంద్రీనీవా కాలువలో పూడికతీయాలని, ముళ్ల పొదలు తొలగించాలని చాబాల, గడేహోతూరు రైతులు మంత్రికి విన్నవించారు.

ఉపాధి పనులు వేగవంతం చేయాలి: ఏపీడీ

కూడేరు, జూలై 29: మండలంలో ఉపాధి పథకం పనుల్లో వెనుకబడిందని, పనులు వేగవంతం చేయాలని క్లస్టర్ ఏపీడీ శైలజ సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాల యంలో సోమవారం ఉపాధి హామీ సిబ్బందితో ఏపీడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉపాధి పనుల్లో హార్టికల్చర్ కింద జరిగిన పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. మండలంలో ఉపాధి హామీ పనులు సక్రమంగా జరగడంలేదని, వేగవంతం చేయాలని తెలిపారు.

'నేతల విగ్రహాలకు మరమ్మతులు చేయండి'

పామిడి, జూలై 29: పట్టణంలో పలుచోట్ల కొలువుదీరిన జాతీయ నేతల విగ్రహాలు పాక్షికంగా దెబ్బతిన్నాయని, వాటికి మరమ్మతులు చేపట్టాలని బీజేపీ నాయకులు కోరారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవంలోగా విగ్రహాలకు మరమ్మతులు చేపట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ ముసలిరెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు అంజినాయక్, యువమోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు రాజశేఖర్‌గౌడ్, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలు లక్ష్మీదేవి, నాయకులు పవన్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను నియమించాలని వినతి

కుందుర్పి, జూలై 29: తమ పిల్లలకు చదువులు చెప్పేవారేలేరని, ఉపాధ్యాయులను నియమించాలని మండల పరిధిలోని మలయనూరు గ్రామస్థులు సోమవారం మండల విద్యాశాఖాధికారి తిప్పేస్వామికి వినతిపత్రం అందజేశారు. మలయ నూరు ఉన్నత పాఠశాలలోకి గతంలో 3, 4, 5 తరగతులను విలీనం చేశారని, ఆ విద్యార్థులకు చదువులు చెప్పే ఉపాధ్యాయులు లేరన్నారు. ఇలా అయితే వారి పరిస్థితి ఎలా అన్నారు. ఉన్నతాధికారి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కరిస్తామని ఎంఈఓ గ్రామస్థులకు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు సంజీవస్వామి, గంగాధర, మల్లి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి పరామర్శ

బ్రహ్మసముద్రం, జూలై 29: మండలంలోని గుడిపల్లికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త బోయ రామలక్ష్మి అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదేశాల మేరకు టీడీపీ మండల కన్వీనర్ పాలబండ్ల శ్రీరాములు సోమవారం గుడిపల్లికి వెళ్లి రామలక్ష్మి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబాన్ని పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

రోడ్లు వేసి, డ్రైనేజీ మరిచారా.. ?

● మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే అమిలినేని ఆగ్రహం

కళ్యాణదుర్గం, జూలై 29: ఆర్‌అండ్‌బీ నిధులతో కోట్లాదిరూపాయలు ఖర్చుచేసి పట్టణంలో రోడ్లు విస్తరణను హడావుడిగా చేశారే గానీ, డ్రైనేజీ ఏర్పాటు చేయాలన్న ఆలోచన రాలేదా అంటూ మున్సిపల్ అధికారులపై ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే సోమవారం మున్సిపల్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. అక్కడున్న అధికారులు, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మున్సిపల్ అధికారుల పనితీరు, పట్టణ అభివృద్ధిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో కళ్యాణ దుర్గం మున్సిపాల్టీ అభివృద్ధి, నిధుల ఖర్చుపై మున్సిపల్ కమిషనర్ నరసారెడ్డిని అడిగి తెలుసుకున్నారు. పట్టణంలో పారిశుధ్యం అస్తవ్యస్తంగా ఉందని, రోడ్లన్నీ అధ్వానంగా మారాయన్నారు. ఇన్నాళ్ల ఏమి చేశారని అధికారులను ప్రశ్నించారు. ఇంకా కొందరు వైసీపీ పాలనలోనే ఉన్నామనే భ్రమలో ఉన్నారని, వారందరినీ గుర్తించి చర్యలు తీసుకుంటామన్నారు. కళ్యాణదుర్గం మున్సిపాల్టీ అభివృద్ధి కోసం నిధుల సమీకరణకు కృషి చేస్తానని తెలిపారు. కావున మున్సిపాల్టీ అభివృద్ధికి అధికారులంతా కలసికట్టుగా ప్రణాళిక రూపొందించాలన్నారు. అలాగే అనధికారిక లేఔట్లు వేసినా, ప్రభుత్వ స్థలాలను అమ్ముకున్నా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది, అధికారులు, కౌన్సిలర్లు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి : ప్రిన్సిపాల్



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల ప్రిన్సిపాల్

గుంతకల్లుటౌన్, జూలై29: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని శ్రీశంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గోపాల్ పేర్కొన్నారు. కళాశాలలో సోమవారం మేనేజ్‌మెంట్ ఫెస్టివల్‌లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు అభినందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... బళ్లారిలోని బళ్లారి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజనీరింగ్ క ళాశాల ఆధ్వర్యంలో 2024 మేనేజ్‌మెంట్ ఫెస్టివల్ ఆర్గనైజేషన్ అనే కార్యక్రమాన్ని నిర్వహించారన్నారు. ఏపీలోని ఇంజనీరింగ్, డిగ్రీ కళాశా లలకు చెందిన వేయి మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అందులో తమ కళాశాల విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారన్నారు. ఆ విద్యార్థులను కళాశాల అధ్యాపకులు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ వరప్రసాద్,డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుభాషిణి, ప్రజా సంబంధాల అధికారి బసెట్టి క్రిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర కమిటీలో చోటు

రాయదుర్గం రూరల్, జూలై 29: జిల్లా వ్యవసాయ మార్కెట్ కమిటీ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు పట్టణానికి చెందిన కావలి ఈశ్వర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన ప్రస్తుతం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రకాశం జిల్లా దర్శి పట్టణంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో తనను ఎన్నుకున్న ట్లు తెలిపారు.

ఉరవకొండ: ఏపీ మార్కెట్ కమిటీ కాంట్రాక్టు ఉద్యోగుల వర్కింగ్ కార్యదర్శిగా సుధాకర్ నియమితులయ్యారు. ప్రకాశం జిల్లా దర్శిలో జరిగిన సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కమిటీలో జిల్లా నుంచి నలుగురికి చోటు దక్కినట్లు సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమానపనికి, సమానవేతనం ఇవ్వాలనీ, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఘనంగా శుభదిన్ భోజన్

గుంతకల్లుటౌన్, జూలై29: శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు దాతల సహకారంతో సోమవారం మధ్యాహ్న భోజనంతో తీపి పదార్థాలు, పౌష్టికాహారం అందజేశారు. పట్టణం లోని పొట్టిశ్రీరాముల మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన శుభదిన్ భోజన్ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఈఓ మస్తాన్‌రావు హాజరయ్యారు. దాత, వార్డు కౌన్సిలర్ ఆంజనేయులు విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. పాఠశాల హెచ్‌ఎం కాశీనాథ్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ ఉమ, సీఆర్‌పీ రఘుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పామిడి : పట్టణంలోని టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో టీడీపీ నాయకుడు ఆర్‌ఆర్ రమేష్ సతీమణి ఈశ్వరి కేసరిబాత్ వడ్డించారు. అలాగే మండలంలోని పీ కొండాపురం పాఠశాలలో టీడీపీ నాయకుడు రంగస్వామియాదవ్ విద్యార్థులకు పండ్లు, అలసంద గుగ్గిళ్లు అందజేశారు. ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయనను ఘనంగా సత్కరించారు.

కణేకల్లు : మండలంలోని హనుమాపురంలో సర్పంచ్ జయరాంచౌదరి, ఎంపీటీసీ నరేంద్ర, గోపులాపురంలో బాయినేని నవీన్, ఉడేగోళంలో సర్పంచ్ మారుతి, మిగిలిన గ్రామాలలో టీడీపీ స్థానిక నాయకులు భోజనం ఏర్పాటు చేశారు. ఎంఈఓ లక్ష్మణ్ణ, భవానీశంకర్, సీఆర్‌పీ రాజేష్‌తో పాటు ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

యాడికి: మండలంలోని రాయలచెరువు, పచ్చారుమేకలపల్లి, కూర్మాజీపేట పాఠశాలల్లో తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రెటరీ పరిమి చరణ్ విద్యార్థులకు పాయసం వడ్డించారు. ఆదర్శ పాఠశాలలో మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, యాడికి నెంబర్-5 ప్రాథమిక పాఠశాలలో కూన వెంకటస్వామి అందించారు. యాడికి, కోనుప్పలపాడుతోపాటు మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ప్రత్యేక భోజనం అందించారు.



విద్యార్థులకు పాయసం వడ్డిస్తున్న తెలుగుయువత నాయకుడు చరణ్

యల్లనూరు: మండలంలోని 38 పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు దాతల సాయంతో అదనపు ఆహారాన్ని విద్యార్థులకు అందించినట్టు ఎంఈఓ -2 పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. యల్లనూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో ఎంపీడీఓ వీర్రాజు, డిప్యూటి తహసీల్దార్ శ్వేత పాల్గొన్నారు.

బ్రహ్మసముద్రం: మండల పరిధిలోని ఎస్ కోనాపురం ప్రాథమిక పాఠశాలలో సోమవారం సర్పంచ్ వనిత శుభదిన్ భోజన్ కార్యక్రమం కింద విద్యార్థులకు ఓళిగలను వడ్డించారు. కార్యక్రమానికి ఎస్ఎంసీ ఛైర్మన్ కరేగౌడ్ర మల్లికార్జున, నల్లమల కరేగౌడ, హెచ్‌ఎం మధుసూదన్ నాయుడు, ఉపాధ్యాయులు సురేఖ, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రేపటి నుంచి మస్తాన్‌వలి ఉరుసు ఉత్సవాలు



మస్తాన్ వలి దర్గా

గుంతకల్లుటౌన్, జూలై29: పట్టణంలోని పాతగుంతకల్లులలో వెలసిన హజరత్ సయ్యద్ మస్తాన్ వలి స్వామి 389వ ఉరుసు ఉత్సవాలు బుధవారం నుంచి ప్రారంభంకానున్నాయి. ఉత్సవా ల నిర్వహణకు వక్ఫ్ బోర్డు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ మేరకు బుధవారం గంధం, గురువారం షంషీర్, శుక్రవారం జియారత్ కార్యక్రమాలు నిర్వహిస్తారు. ఉరుసు ఉత్సవాలకు రాష్ట్రంతో పాటు తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలి వస్తారు. భక్తులకు తాగునీటి సౌకర్యం తదితర ఏర్పాట్లు చేశారు. మున్సిపాలిటీ ఆధ్వర్యంలో తాగునీటి ట్యాంకర్లను అందుబాటులో ఉంచారు. దర్గాను విద్యుత్ దీపాలతో అలకరించారు. దర్గా అవరణంలో 24 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశారు. గంధం, షంషీర్ రోజు వక్ఫ్ బోర్డు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఆయిల్‌పామ్ సాగుకు శ్రీకారం

బొమ్మనహాళ్, జూలై 29 : ప్రత్యామ్నాయ పంటల సాగులో భాగంగా అయిల్‌పామ్ పంటను సాగు చేసేందుకు శ్రీకారం చుట్టారు. రియా ఆగ్రో ఇండస్ట్రీ కంపెనీ, ఉద్యానశాఖ అధికారులు సోమవారం మండలంలోని నేమకల్లు నుంచి ప్రారంభించారు. నేమకల్లులో సోమవారం రియా ఆగ్రో కంపెనీ ఆధ్వర్యంలో గ్రామానికి చెందిన ముత్తు, ఆంజనేయ అనే రైతుల పొలాల్లో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, జిల్లా ఉద్యానశాఖ అధికారి నరసింహరావు ముఖ్యఅతిథులుగా పాల్గొని మొ క్కలు నాటారు. నిర్దేశించిన లక్ష్యం ప్రకారం ఈ ఏడాది జిల్లా వ్యాప్తంగా ఆరు మండలాల్లో 300 హెక్టార్లలో ఆయిల్‌పామ్ సాగు చేసేందుకు ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నామని ఉద్యానశాఖ అధికారి, రియా ఆగ్రో కంపెనీ ప్రతినిదులు తెలిపారు. నియోజకవర్గంలోని బొమ్మన హాళ్, కణేకల్లు, డీ.హీరేహాళ్ మండలాలలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు చొరవతో మొక్కలు నాటేందుకు చర్యలు తీసుకున్నామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలవ మాట్లాడుతూ 15 మెట్రిక్ టన్నుల రిఫైనరీ కృష్ణపట్నం పోర్టులో ఉందని తెలిపారు. కావున నియోజకవర్గంలోని రైతులు ఆయిల్‌పామ్‌ను ఎన్ని ఎకరాలలో సాగు చేయాలనుకున్నా, అందుకు టీడీపీ ప్రభుత్వం, రియా ఆగ్రో సంస్థ సహాయ సహకారాలు అందుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ లక్ష్మనాయక్, కంపెనీ ప్రతినిధులు రఘువర్మ, సంజయ్ జైన్, రామ్మోహన్‌రావు, టీడీపీ మండల కన్వీనర్ బలరాంరెడ్డి, కేశవరెడ్డి, కొత్తపల్లి మల్లికార్జున, ముల్లంగి నారాయణస్వామి, అప్పారావు, మహేంద్ర, పయ్యావుల అనిల్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను నూతనంగా ఎన్నికైన కురుబ సంఘం సభ్యులు సన్మానించారు. సంఘం అధ్యక్షుడు కే నాగరాజు, జనరల్ సెక్రెటరీ ఎమ్మార్పీ మల్లన్న, దిలీప్ తదితరులు కలిసి శాలువతో సత్కరించారు. కమిటీకి తనవంతుగా సహాయ సహకారాలు అందిస్తానని ఎమ్మెల్యే తెలిపారు.

13 రోజుల తరువాత గుండం నుంచి మంటలు



గుండంలో నుంచి మంటలు వస్తున్న దృశ్యం

విడపనకల్లు, జూలై 29: మండలంలోని గడేకల్లు గ్రామంలో మొహరం వేడుకలు ముగిసి పోయి 13 రోజులు అయింది. అయితే పూడ్చిన పీర్ల గుండం గుండుం నుంచి మంటలు బయటకు వస్తున్నాయి. గడేకల్లులో తప్పడం స్వామి పీర్లుగుడిలో పెద్ద పీర్ల పండుగ సందర్భంగా అగ్ని గుండం వెలిగించి పీర్ల ప్రవేశం చేయించారు. పీర్ల జలధి సందర్భంగా అగ్ని గుండాన్ని ఈనెల 15వతేదీన మట్టితో కప్పి పూడ్చి వేశారు. అగ్ని గుండం పూడ్చి సోమవారానికి 13 రోజులు అయింది. అయితే గుండలో నుంచి మంటలు వస్తుండటంతో... ఇది స్వామి మహిమ అంటూ ఈ దృశ్యాన్ని తిలకించేందుకు తరలి వెళ్తున్నారు.

డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ

విడపనకల్లు, జూలై 29: డెంగీ, మలేరియా వంటి వ్యాధులు రాకుండా దోమలను అరికట్టాలని, వ్యాధుల నివారణకు తగిన జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారులు వైద్యులు రాజేంద్ర పేర్కొన్నారు. మండలంలోని పాల్తూరులో సోమవారం వైద్య సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు డెంగీ నివారణపై అవగాహన ర్యాలీ చేపట్టారు. స్థానిక పీహెచ్‌సి నుంచి బస్టాండ్ వరకూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవ హారం ఏర్పాటు చేసి సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మలేరియా యూనిట్ అధికారి కోదండ రామిరెడ్డి, వైద్యులు అనురాధ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

యాడికి: దోమల నివారణతోనే రోగాలకు అడ్డుకట్ట వేయవచ్చునని మలేరియా నివారణ తాడిపత్రి సబ్‌యూనిట్ అధికారి శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని కోనుప్పలపాడు గ్రామంలో సోమవారం దోమల నివారణ, మలేరియా, డెంగీ వంటి విషజ్వరాల వ్యాప్తిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దోమల నివారణ కోసం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ర్యాలీలో కోనుప్పలపాడు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు చిన్నపెద్దన్న, ఉపాధ్యాయుడు పవన్‌కుమార్, ఆరోగ్య సిబ్బంది రాంప్రసాద్‌గౌడ్, ఎస్తేర్‌రాణి తదితరులు పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు శిక్షణ



స్పెయిన్ దేశస్థులతో హాకీ క్రీడాకారులు

విడపనకల్లు, జూలై 29: మండలంలోని పాల్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని హాకీ క్రీడా విద్యార్థులకు సోమవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మాట్లాడుతూ.. ఆర్డీటీ తరపున స్పెయిన్ దేశస్థులు పాఠశాలకు చెందిన హాకీ క్రీడాకారులను దత్తత తీసుకున్నారన్నారు. అనంతపురం వచ్చిన స్పెయిన్ దేశస్థులు సోమవారం పాల్తూరుకు వచ్చి విద్యార్థులకు హాకీలో మెలకువలను నేర్పించినట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సర్వమంగళ, పీడీలు శ్రీనివాసులు, రమేష్‌బాబు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ

కళ్యాణదుర్గం(శెట్టూరు), జూలై 29: మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని అధికారులు తెలిపారు. ఉపాధి హామీ సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని జడ్పీ పాఠశాల ఆవరణంలో స్థానిక సర్పంచ్ ఉరాలకుమార్, ఈవోఆర్డీ రఘురామారావు, ఎంఈవో శ్రీధర్ చేతుల మీదుగా మొక్కలు నాటారు. ఏపీవో నీరజ, హెచ్‌ఎం ఫిరోజ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు వైద్యశిబిరం

గుత్తి రూరల్, జూలై 29: మండలంలోని సేవాఘడ్‌లోని సంత్ సేవాలాల్ మహరాజ్ ఆలయ ఆవరణంలో మంగళవారం ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు ట్రస్టు సభ్యులు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయత్రం 5 గంటల వరకు ఉంటుందని తెలిపారు.